వార్త
ఆదివారం
27 జూలై, 2025

# మానవత్వమా! మాయం కావొద్దు



పలు తెలుగు మూవీల్లో నేరుగా నటించిన ప్రముఖ కన్నడ నటుడు ఉపేంద్ర ప్రస్తుతం రామ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఆంధ్ర కింగ్ తాలూకా మూవీలో కీలక పాత్ర చేస్తున్న ఉపేంద్ర ఉపేంద్రకు కథ వినిపించిన పేపర్ బాయ్ ఫేమ్ జయశంకర్ ప్రముఖ కన్నడ నటుడు ఉపేంద్ర పాన్ ఇండియా



# కొత్త మూవీలో ఉపేంద్ర

స్థాయిలో రూపొందనున్న తెలుగు సినిమాలో నటించేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఆయన దర్శకత్వం వహించిన అనువాద చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఉపేంద్ర, ఆ తర్వాత నేరుగా పలు తెలుగు సినిమాల్లో నటించి ఇక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని పొందుతున్నాడు. కన్యాదానం, ఒకే మాటతో మొదలై సన్నాఫ్ సత్యమూర్తి, గని వంటి చిత్రాల్లో ఉపేంద్ర నటించారు. ప్రస్తుతం రామ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ఆంధ్ర కింగ్ సినిమాలో ఉపేంద్ర ఒ కీలక పాత్ర పోషిస్తున్నారు. దీంతోపాటు ఆయన మరో తెలుగు సినిమాకు కూడా అంగీకరించినట్లు తెలుస్తోంది. ఇటీవల ఉపేంద్రను 'పేపర్ బాయ్' ఫేమ్ జయశంకర్ కలిసి కథ వినిపించినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో నిర్మించనున్న ఈ కథకు ఉపేంద్ర గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్. దాదాపు వంద కోట్ల రూపాయల వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

**తారాతీరం**

యథార్థ సంఘటనలతో, సమాజంలో జరిగిన వాస్తవ కథను తెరపై ఆసక్తికరంగా చూపిస్తే ఆ చిత్రాలు తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతాయి. ఇప్పుడు ఈ కోవలోనే యథార్థ సంఘటనలతో రూపొందిన ఓ వైవిధ్యమైన గ్రామీణ ప్రేమకథగా 'ఉసురే' ఆగస్టు 1న విడుదల కానుంది. టీజయ్ అరుణాసలం, జననీ కునశీలన్ హీరో, హీరోయిన్స్‌గా రూపొందుతోన్న ఈ చిత్రానికి నవీన్ డి.గోపాల్ దర్శకుడు. శ్రీకృష్ణ ప్రొడక్షన్స్ సమర్పణలో బకియా లక్ష్మీ టాకీస్ పతాకంపై మౌళి ఎం.రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని ఆగస్టు 1న విడుదల చేస్తున్నారు మేకర్స్. సీనియర్ హీరోయిన్ రాశి ఈ చిత్రంలో ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ను చూస్తుంటే ఇదొక సహజమైన, వైవిధ్యమైన ప్రేమకథలా అనిపిస్తుంది. ప్రతి సన్నివేశం ఎంతో రియలిస్టిక్‌గా అనిపిస్తుంది.



# 'ఉసురే' విడుదలకు రెడీ

ఆదివారం వార్త

27 జూలై, 2025

## మంచి ముత్యాలు

నిజమైన సహాయకుడు సుఖ దుఃఖాలలో సమానంగా ఆదుకుంటాడు
– చాణక్యుడు

ముందుచూపు లేని మనిషి చేరువలోనే బాధలుంటాయి – కన్ఫూషియస్

## కదంబం

'సంఘీ'భావం....5
కొత్త పుంతలు తొక్కుతున్న ర్యాగింగ్

కవర్ స్టోరీ..6
మానవత్వమా!
మాయం కావొద్దు

ఈ వారం కవిత్వం...12
చూడాలని ఉంది..

ఉన్నత స్థానంలో బొబ్బిలి వీణ.. 14

ప్రజారోగ్య సంరక్షణలో... 18

కథ..20
నమ్మకం

సాహిత్యం.. 23
తల్లిపలుకు దారి ఎటు?

ఇంకా...
మొగ్గ
వారఫలం
వంటలు
వగైరా.. వగైరా..

# సమాచారం

## 'కాగజీపుర'లో కాగితాల తయారీ


ఇప్పటి వరకు మనం రకరకాల ఊళ్లు, పట్టణాల పేర్లు విని ఉంటాం. కానీ 'పేపర్ సిటీ' గురించి వినలేదు. అయితే ఇప్పుడు పేపర్ సిటీ గురించి తెలుసుకుందాం. సాధారణంగా కాగితాలను చెట్టు నుంచి వచ్చే గుజ్జుతో తయారు చేస్తారు కదా! కానీ మహారాష్ట్రలోని కాగజీపురలో మాత్రం పాత కాటన్ దుస్తులతో చేస్తారు. కాగజ్ అంటే కాగితం. పుర అంటే పట్టణం అని అర్థం. పలు ప్రాంతాల నుంచి పాత కాటన్ దుస్తులను సేకరించి, వాటిని ఇక్కడ కాగితాల తయారీలో వాడతారు. ఆ బట్టలను నీళ్లలో నానబెట్టి వివిధ పద్ధతుల ద్వారా గుజ్జులా చేస్తారు. దాంట్లో జనపనార, చెట్టు బెరడు గుజ్జును కలిపి కరెంటు వాడకుండా నిప్పుల మీద ఈ మిశ్రమాన్ని వేడి చేస్తారు. ఆ తర్వాత నాణ్యమైన హ్యాండ్ మేడ్ కాగితం దూపుదిద్దుకుంటుంది. ముప్ఫై కిలోల కాటన్ నుంచి సుమారు 750 పేపర్ షీట్లను తయారు చేస్తారు. అరవై షీట్లు చేయడానికి ఎనిమిది గంటల సమయం




పడుతుంది. మన దేశంలో కాగితాల తయారీ మీద ఆధారపడే వాళ్లు ఈ పట్టణంలోనే ఎక్కువగా ఉన్నారు. ఇక్కడ 700 సంవత్సరాల నుంచే ఈ సాంప్రదాయం ఉన్నట్లు తెలుస్తోంది. అప్పట్లో ఎక్కువ రోజులు భద్రంగా ఉంచుకోవాల్సిన అధికారిక పత్రాలను ఈ కాగితాల మీదే రాసేవారు. మొదట్లో ఆ పట్టణంలో ఉండే వివిధ కార్యాలయాలకు కాగితాలను సరఫరా చేసేవారు. నెమ్మదిగా అభివృద్ధి చెంది దేశంలోని వివిధ ప్రాంతాలకూ కాగితాలు అందించగలిగే స్థాయికి ఈ గ్రామం ఎదిగింది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com







వెర్రి వేయి విధాలు అంటే బహుశా ఇదేనేమో! ఏది ఎక్కడుండాలో అక్కడ ఉంటేనే అందం... చందం. స్టైల్‌గా ఉండడంలో ఎంతమాత్రం తప్పు లేదు. కానీ మరీ విడ్డూరం కాకపోతే ఇలా పాములను, బల్లులను చెవికెక్కించుకున్నారు.




'సంఘీ' భావం



# కొత్త పుంతలు తొక్కుతున్న ర్యాగింగ్

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ పెనుభూతంగా మారింది. ఎందరో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోంది. ర్యాగింగ్‌కు భయపడి వందల సంఖ్యలో విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు. ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ఎన్ని చట్టాలు ఉన్నా, పోలీసుల నిఘా కొనసాగినా పూర్తి స్థాయిలో దీనిని అణచివేసే పరిస్థితులు కనిపించడం లేదు. సీనియర్లు చేసే తమాషా పరిచయాలు కాస్త దారుణంగా మారి విద్యార్థుల జీవితాలు బలైపోయిన సంఘటనలు కోకొల్లలు ఉన్నాయి. అందుకే దీనిపై అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు, పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ర్యాగింగ్ చేస్తే జైలు శిక్షలు తప్పవని, చదువుకు స్వస్తి పలకాల్సి వస్తుందని హెచ్చరించారు. సీనియర్స్ స్టూడెంట్లే కాదు కాలేజ్ యాజమాన్యాలను సైతం చట్టం ముందు నిలబెట్టి వారికి శిక్షలు పడేలా చేశారు. ఇటీవల వరంగల్‌లో మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ శ్రుతిమించడంతో పిజి విద్యార్థిని మృతి చెందడం, కొందరు విద్యార్థులపై కేసులు నమోదు చేయడం కూడా జరిగింది. గుంటూరులోని మెడికల్ కళాశాలలో కూడా ర్యాగింగ్ ఘటన చోటు చేసుకుంది. దీనిని పూర్తిగా అరికట్టాలన్న లక్ష్యంతో కళాశాలల్లో యాంటీ ర్యాగింగ్ టీమ్స్ ఏర్పాటు చేశారు. ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ర్యాగింగ్ బెడద మాత్రం తప్పడం లేదు. ప్రస్తుతం ఆధునిక సాంకేతికత పెరిగిపోవడంతో కొత్త విధానంలో ర్యాగింగ్ కొనసాగుతోంది. ఈసారి సోషల్ మీడియా, వాట్సాప్ ద్వారా మళ్లీ పంజా విసిరింది. అందుకే దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతాన్ని పూర్తిగా అరికట్టే దిశగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) కీలక ఆదేశాలు జారీ చేసింది. జూనియర్ విద్యార్థులను వేధించేందుకు సీనియర్లు ఏర్పాటు చేసే అనధికారిక వాట్సాప్ గ్రూపులను కూడా ఇకపై ర్యాగింగ్‌గానే పరిగణించనున్నట్లు స్పష్టం చేసింది. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై యాంటీ ర్యాగింగ్ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. సీనియర్లు ఏర్పాటు చేసే వాట్సాప్ గ్రూపుల ద్వారా జూనియర్లను మానసికంగా వేధిస్తున్నారని ప్రతీ ఏటా తమకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని యూజీసీ తన తాజా మార్గదర్శకాలలో పేర్కొంది. ఇలాంటి చర్యలు కూడా ర్యాగింగ్ కిందకే వస్తాయి. వీటిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. క్యాంపస్‌లలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. యాంటీ ర్యాగింగ్ నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యే విద్యాసంస్థలకు గ్రాంట్లను నిలిపివేయడం వంటి కఠిన చర్యలు తప్పవని యూజీసీ హెచ్చరించింది. సీనియర్ల సూచనలు పాటించని జూనియర్లను సామాజికంగా బహిష్కరిస్తామని బెదిరించడం, ఎక్కువ గంటలు మేల్కొని ఉండేలా చేయడం, మాటలతో అవమానించడం వంటివి కూడా తీవ్రమైన ర్యాగింగ్ చర్యలేనని పేర్కొంది. ఇలాంటి పనులు విద్యార్థులలో తీవ్రమైన శారీరక, మానసిక క్షోభకు కారణమవుతాయని, ఇవి యాంటీర్యాగింగ్ నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని యూజీసీ స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని తేల్చి చెప్పింది. ప్రధానంగా ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నై వంటి నగరాల్లో సోషల్ మీడియా ద్వారా ర్యాగింగ్‌ను కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వృత్తి విద్య కళాశాలల్లో సీనియర్ విద్యార్థులు అనధికార వాట్సప్ గ్రూప్‌లను ఏర్పాటుచేసి అందులో కొందరు జూనియర్లను చేర్చి వారిపై అసభ్య పదజాలంతో ఇబ్బందులు పెడుతున్నారు. ఈ మెసేజ్‌లను బయటకు చెబితే కళాశాలలోకి రాకుండా చేస్తామని, దాడులు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. దీనితో జూనియర్లు ఇబ్బందులకు గురౌతున్నారు. సెల్‌ఫోన్‌లో వాట్సప్ మెస్సేజ్‌లు చూడాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. దీనితో కొందరు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్లకు, న్యూఢిల్లీలోని యుజిసి కార్యాలయాలకు ఫిర్యాదులు చేస్తున్నారు. దీనితో యుజిసి సోషల్ మీడియా పోస్టింగ్‌లపై దృష్టిసారించింది. ఎక్కడైనా సీనియర్ విద్యార్థులు ఇలాంటి అనధికార వాట్సప్ గ్రూప్‌లు ఏర్పాటుచేస్తే కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలకు సమాచారం ఇచ్చింది. భౌతికంగా ర్యాగింగ్ చేస్తే ఏ విధమైన శిక్షలు ఉంటాయో వాటినే సోషల్ మీడియా వేధింపు ఘటనలకు కూడా వర్తింపచేయాలని ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ర్యాగింగ్ జరిగినట్లు రుజువు అయితే ఆయా విద్యార్థులను కళాశాలల నుంచి బహిష్కరించడమే కాకుండా పోలీసులకు సమాచారం ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హకీం జాని

# మానవత్వమా! మాయం కావొద్దు



**ఇప్పుడు** ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా మనుషుల్లో మానవత్వం కరువౌతుందనే విషయం వినిపిస్తోంది. కొందరు మనుషుల ప్రవర్తనను పరిశీలిస్తే మానవత్వం అనేది పూర్తిగా నశించి మానవుడు దానవుడిగా మారిపోతున్నాడా? అనిపిస్తుంది.

## మానవత్వం అంటే ఏమిటి?

మానవత్వం అంటే కేవలం సుందరమైన శారీరక ఆకారం కలిగి ఉండటం కాదు. మనిషిగా జీవించడానికి అవసరమైన ఉన్నతమైన గుణాలు, విలువలు కలిగి ఉండటమే నిజమైన మానవత్వం. మానవులను జంతువుల నుండి వేరు చేసే ప్రధాన లక్షణం ఇదే. ఆదిమానవులు ఆవిర్భవించిన తొలినాళ్లల్లో బలమున్నవాడిదే రాజ్యంగా ఉండేది. తరువాత కొన్ని కట్టుబాట్లు ఏర్పరచుకుని సంఘజీవనం సాగించడం మొదలెట్టారు. మానవుడు సంఘజీవి అని అరిస్టాటిల్ అన్నాడు. మానవతా విలువలు అనేవి మానవ జీవనానికి ఆధారమైన నీతి, ధర్మం, సామాజిక సౌహార్ధాన్ని పెంపొందించే సూత్రాలు. ఇవి వ్యక్తుల మధ్య సహకారం, గౌరవం, శాంతిని ప్రోత్సహించే లక్షణాలను కలిగి ఉంటాయి. ఇతరుల కష్టాలను చూసి జాలిపడటం, వారికి సహాయం చేయడానికి ముందుకు రావడం, ఆపదలో ఉన్నవారికి చేదోడు వాదోడుగా ఉండటం, కుల, మత, వర్గ భేదాలు లేకుండా మనుషులందరినీ సమానంగా ప్రేమించడం, ఎప్పుడూ నిజాయితీగా వుండి నిజం పలకడం, ఎవరికీ హాని చేయకుండా ఉండటం, హింసకు దూరంగా ఉండటం, ఇతరుల తప్పులను క్షమించి ముందుకు సాగడం, విభిన్న నమ్మకాలను, ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం, శాంతియుతంగా కలిసి జీవించడం, సొంత లాభాపేక్ష లేకుండా ఇతరులకు మేలు చేయడం.. ఇవన్నీ మానవత్వానికి ప్రతీకలు. మానవత్వం మనిషిని ఉన్నతంగా నిలబెడుతుంది. మానవత్వం ఉన్నప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం నెలకొంటాయి. ఎదుటివారి కష్టాలను మన కష్టాలుగా భావించి, వారికి సహాయం అందించడమే నిజమైన మానవత్వం. అందుకే "మానవత్వాన్ని మించిన మతం లేదు" అని పెద్దలు అంటారు. మానవత్వం అనేది కేవలం ఒక భావోద్వేగం, ఆలోచన మాత్రమే కాదు, ఇది ఒక నడవడిక, మనం ఇతరులతో ఎలా ప్రవర్తిస్తామనే దానిపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా మానవత్వం అంటే సహానుభూతి, సామాజిక సహకారం, నైతిక భావనలు, సృజనాత్మకత, సంక్లిష్ట ఆలోచనలు వంటి లక్షణాలను కలిగి ఉండటం. మానవతా విలువలు అంటే మానవులుగా మనం కలిగి ఉండాల్సిన మంచి లక్షణాలు, నైతిక సూత్రాలు, ఇవి మనం ఇతరులతో, సమాజంతో ఎలా వ్యవహరించాలో తెలియజేస్తాయి. ఈ విలువలు లేకుండా మనిషి కేవలం ఆకారం మాత్రమే అవుతాడు తప్ప నిజమైన సంపూర్ణ మానవుడు కాలేడు.

## ఆదిమానవుల్లో మానవత్వం

ఆదిమానవుల్లో మానవత్వం ఎలా ఉండేదో తెలుసుకోవడానికి పురావస్తు శాస్త్రజ్ఞులు, మానవ పరిణామ శాస్త్రజ్ఞులు అనేక అధ్యయనాలు చేసి కొన్ని విషయాలు తెలుసుకున్నారు. ఆదిమానవులలో హోమో సేపియన్స్‌తో పాటు వారి పూర్వీకులైన హోమో హెబిలిస్, హోమో ఎరెక్టస్, నియాండర్తల్స్ వంటి జాతులపై శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనల ఆధారంగా ఆదిమానవుల్లో మానవత్వం ఉండేదని చెప్పడానికి చాలా బలమైన ఆధారాలు లభించాయి. ఆదిమానవులు ఇతరుల పట్ల జాలి, కరుణ చూపినట్లు ఆధారాలున్నాయి. బలహీనమైన, గాయపడిన వారిని ఆదుకోవడం, పోషించడం వంటివి అప్పటి సమాజంలో సాధారణమని తెలుస్తోంది. కోబి ఫోరా (కెన్యా)లో 1.6 మిలియన్ సంవత్సరాల క్రితం నాటి 'హోమో ఎర్గాస్టర్' జాతికి చెందిన ఒక మహిళ అస్థిపంజరం కనుగొన్నారు. ఆమె తీవ్రమైన వ్యాధితో బాధపడినప్పటికీ చాలా వారాల పాటు జీవించి ఉన్నట్లు ఆమె ఎముకల వల్ల తేటతెల్లమైంది.

దీని అర్థం ఆమెకు ఆహారం, నీరు అందించి, క్రూర మృగాల నుంచి రక్షించి ఉండాలి. ఇది ఇతరుల పట్ల శ్రద్ధకు స్పష్టమైన సూచన. నియోండర్తల్స్ కూడా వారి సమూహంలో అనారోగ్యంతో ఉన్న, గాయపడిన వారితోపాటు వృద్ధులైన వారికి నిస్వార్థంగా సేవ చేశారని ఆధారాలున్నాయి.

షానిదార్ 1 అనే నియోండర్తాల్ పురుషుడి అవశేషాలు దీనికి మంచి ఉదాహరణ. అతనికి ఒక చేయి లేకపోయినా, అనేక గాయాలు ఉన్నా, అతను చాలా కాలం జీవించాడు. నియాండర్తాల్స్ వంటి జాతులు కూడా సమాధులను సృష్టించినట్లు ఆధారాలు ఉన్నాయి. ఈ సంఘటనను మానవత్వానికి ప్రతీకగా చెప్పవచ్చు. ఇది అతని బృంద సభ్యులు అతనికి చాలా కాలం పాటు సంరక్షణ అందించారని సూచిస్తుంది. చనిపోయినవారిని ఖననం చేసే పద్ధతులు, కొన్ని రకాల ఆచారాలు ఆదిమానవుల మధ్య బలమైన భావోద్వేగ బంధాలు ఉన్నాయని తెలియజేస్తుంది. ప్రియమైన వారిని కోల్పోయినప్పుడు కలిగే దుఃఖం, దాన్ని పంచుకునే తత్వం మానవత్వానికి ప్రతీక. వేట, ఆహార సేకరణ వంటి కార్యకలాపాలలో ఆదిమానవులు ఒకరికొకరు సహకరించుకున్నారు. ఇది వారి మనుగడకు అత్యవసరం. కుటుంబ సభ్యులు, బంధువులు ఒకరినొకరు చూసుకోవడం, పిల్లల సంరక్షణలో సహాయం చేయడం వంటివి కూడా సామాజిక మానవత్వంలో భాగమే. ఆదిమానవులు సమూహాలుగా జీవించారు. ఇది వారి మనుగడకు కీలకం. వేట, ఆహార సేకరణ, శిశువుల పెంపకంలో సహకారం వారిలో సామాజిక బంధాలను సూచిస్తుంది.



## మానవతా విలువలు ఎందుకు తగ్గుతున్నాయి?

భారతదేశంలో మానవతా విలువలు తరుగుతున్నాయనే ఆందోళన ఇటీవలి సంవత్సరాలలో అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాల వల్ల చర్చనీయాంశంగా మారింది. మానవత్వం అనేది సానుభూతి, సహకారం, గౌరవం, నీతి, సామాజిక న్యాయం వంటి గుణాలను సూచిస్తుంది. కొన్ని ధోరణుల వల్ల ఈ విలువల తగ్గుదల ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.



### సామాజిక అసమానతలు

2025 హ్యూమన్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ ప్రకారం భారతదేశంలో ఆదాయ అసమానతలు మానవ అభివృద్ధిని 30.7 శాతం తగ్గిస్తున్నాయి. ఈ అసమానతలు సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తూ, సానుభూతి, సహకారం వంటి మానవతా విలువలను క్షీణింపజేస్తున్నాయి. కులం, మతం, ప్రాంతీయ విభజనలు సామాజిక ఐక్యతను దెబ్బతీస్తున్నాయి. ఇటీవలి సంఘటనలు, ముఖ్యంగా మతపరమైన ఉద్రిక్తతలు, కుల ఆధారిత హింస, సహనం, సానుభూతి వంటి విలువలను దెబ్బతీస్తున్నాయి. మహిళల రాజకీయ ప్రాతినిధ్యం, శ్రామిక వర్గంలో భాగస్వామ్యం తక్కువగా ఉండటం వల్ల స్త్రీ, పురుష సమానత్వం లోపిస్తోంది. ఇటీవల చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించినప్పటికీ, సామాజిక దృక్పథంలో మార్పు నెమ్మదిగా జరుగుతోంది, ఇది లింగ ఆధారిత వివక్షను కొనసాగిస్తోంది. కుటుంబ బంధాలు బలహీనపడటం, ఉమ్మడి కుటుంబాలు కనుమరుగుకావడం, తల్లిదండ్రులు పిల్లలకు విలువలను నేర్పించలేకపోవడం వంటివి ఒక కారణం. సమాజంలో విలువలను పెంపొందించడానికి అవసరమైన ఆదర్శప్రాయులు లేకపోవడం కూడా ఒక కారణం.

### స్వప్రయోజనాలు

మనుషుల్లో వ్యక్తిగత స్వార్థం పెరిగింది. ఎవరి స్వప్రయోజనాలు వాళ్లు చూసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి దోహదపడుతున్నప్పటికీ, అవి తరచూ విద్వేష ప్రసంగం, తప్పుడు సమాచారం, సైబర్ బెదిరింపులకు వేదికగా మారుతున్నాయి. ఇది సామాజిక సంబంధాలను బలహీనపరుస్తూ, సానుభూతి, గౌరవం వంటి విలువలను తగ్గిస్తోంది. మీడియా, సోషల్ మీడియాలో హింస, అవినీతి, అనైతికతను ప్రచారం చేయడం వల్ల ప్రజలు బాధ్యత లేకుండా నిర్లక్ష్యంగా మారుతున్నారు. ఆధునిక జీవన శైలి, పట్టణీకరణ వల్ల వ్యక్తిగత లక్ష్యాలు, స్వప్రయోజనాలు సామాజిక బాధ్యత కంటే ఎక్కువ ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. ఇది సముదాయ భావనను క్షీణింపజేస్తోంది.

## పర్యావరణ విధ్వంసం

భారతదేశంలో పర్యావరణ వనరుల అతిగా వినియోగం, భూగర్భ జలాల క్షీణత, అడవుల నిర్మూలన వంటి సమస్యలు పర్యావరణ పట్ల బాధ్యతాయుతమైన దృక్పథం లోపించడాన్ని సూచిస్తున్నాయి. 2025 నాటికి భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతాయని ఐక్యరాజ్యసమితి నివేదిక సూచిస్తోంది. ఇది భవిష్యత్ తరాల పట్ల సానుభూతి లేకపోవడాన్ని ప్రతిబింబిస్తుంది. వరదలు, కరువు, భూకంపాలు వంటి సహజ విపత్తులు, ఆర్థిక నష్టాలతో పాటు సామాజిక సంఘీభావాన్ని కూడా పరీక్షిస్తున్నాయి. 1980-2010 మధ్య కాలంలో ఇటువంటివి నాలుగు వందలకు పైగా సంఘటనలు జరిగాయి. విపత్తు సమయాల్లో సహాయం చేయడానికి బదులు, కొన్ని సందర్భాల్లో వివాదాలు, దోపిడీ పెరుగుతున్నాయి.

## నైతికత లోపం

ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 2011-12 నుంచి 2022-23 మధ్య తీవ్ర పేదరికం 27.1 శాతం నుంచి 5.3 శాతానికి తగ్గినప్పటికీ ఇంకా 75.24 మిలియన్ల మంది పేదరికంలో ఉన్నారు. ఈ ఆర్థిక ఒత్తిడి కొన్ని సందర్భాల్లో నైతిక విలువలను విస్మరించేలా చేస్తోంది. అవినీతి, అనైతిక వ్యాపార పద్ధతులు సామాజిక న్యాయం, నైతిక విలువలను దెబ్బతీస్తున్నాయి. ఇవి సమాజంలో నమ్మకాన్ని తగ్గిస్తూ, సామాజిక సంబంధాలను బలహీనపరుస్తున్నాయి.




## నైతిక క్షీణత

విద్యా వ్యవస్థలో నైతిక విలువలపై దృష్టి తగ్గడం వల్ల యువతలో సామాజిక బాధ్యత లోపిస్తోంది. విద్యా సంస్థలు తరచూ వాణిజ్య లక్ష్యాలపై దృష్టి సారిస్తున్నాయి. భారతదేశంలో సంప్రదాయంగా ఉన్న 'వసుధైక కుటుంబం' వంటి విలువలు కనుమరుగౌతున్నాయి. ఆధునిక జీవనశైలి, రాజకీయ, వ్యక్తిగత ప్రయోజనాలు, పాశ్చాత్య ప్రభావం వల్ల కొంతమేర క్షీణిస్తున్నాయి. గ్లోబలైజేషన్, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం, వ్యక్తిగతవాదం పెరగడం వల్ల సంప్రదాయ విలువలు తగ్గుతున్నాయి. పాఠశాలల్లో నైతిక విద్యకు తగిన ప్రాధాన్యత లేకపోవడం వల్ల యువతలో విలువలు కొరవడుతున్నాయి. విద్య కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే అనే భావన పెరిగింది. పేదరికం, ఆదాయ అసమానతలు, నిరుద్యోగం వంటి ఆర్థిక కారణాల వల్ల ప్రజలు నైతిక విలువలను పక్కన పెట్టి స్వార్థ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది అవినీతి, దోపిడీకి దారితీస్తోంది.

## తల్లిదండ్రులను కడతేరుస్తున్న సంఘటనలు

ప్రపంచంలోని అనేక అభివృద్ధి చెందిన దేశాలలో సైతం ఆస్తుల కోసం కన్న తల్లిదండ్రులనే తమ బిడ్డలు కడతేరుస్తున్నారు. ఇది చాలా శోచనీయ విషయం. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో ఆస్తుల కోసం తల్లిదండ్రులను చంపిన అనేక కేసులు నమోదయ్యాయి. ఒక వ్యక్తి తన తల్లిదండ్రులను చంపే చర్యను 'ప్యారిసైడ్' అని అంటారు. ఇందులో తల్లిని చంపడం మాట్రిసైడ్ అని, తండ్రిని చంపడం ప్యాట్రిసైడ్ అని పిలుస్తారు. కొడుకులు, కుమార్తెలు తల్లిదండ్రుల బీమా డబ్బు, వారసత్వం కోసం హత్యలు చేసిన సందర్భాలున్నాయి. ఈ కేసుల్లో తరచుగా కుటుంబ వివాదాలు, మాదకద్రవ్యాల వ్యసనం, ఆర్థిక ఇబ్బందులు వంటి అంశాలు కూడా కలిసి ఉంటాయి. 1976-2007 మధ్య కాలంలో యునైటెడ్ స్టేట్స్ లో సంవత్సరానికి సగటున 113 మంది మాతృహత్యకు పాల్పడిన వారిని, 31 మంది యువకులు తండ్రులను, 18 మంది యువకులు తల్లులను చంపినట్లు అరెస్టు చేశారు. యునైటెడ్ స్టేట్స్ కు చెందిన మెనెంజెజ్ బ్రదర్స్ 1989లో తమ తల్లిదండ్రులను హత్య చేశారు. ఈ కేసులో ఆస్తితో పాటు వ్యక్తిగత కారణంగా పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్ కు చెందిన నికితా కాసాప్ టీనేజర్ 2025లో తన తల్లిదండ్రులను డబ్బు కోసం హత్య చేశాడని ఆరోపణలున్నాయి. 2010లో మొత్తం హత్యలలో తల్లిదండ్రుల హత్యలు సుమారు 2 శాతంగా ఉన్నాయి. యూరోపియన్ దేశాలలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయి. వాటి సంఖ్య చాలా తక్కువ. కొన్ని కేసులలో వారసత్వ వివాదాలు, కుటుంబ వ్యాపారాలపై నియంత్రణ కోసం హత్యలు జరిగాయి. బ్రెజిల్‌కు చెందిన సుజాన్ వోన్ రిచ్తోఫెన్ అనే ఆమె 2002లో తన ప్రియుడు, అతని సోదరుడి సహాయంతో తన తల్లిదండ్రులను హత్య చేసింది. ఈ కేసులో కూడా ఆస్తి ప్రధాన ప్రేరణలలో ఒకటిగా ఉంది. బెంగళూరులో 2025 సంవత్సరం మార్చి నెలలో ఒక న్యాయవాది తన అన్నను ఆస్తి పంపకాల విషయంలో జరిగిన గొడవలో కత్తితో పొడిచి చంపాడు. వారి తండ్రి చనిపోయినప్పటి నుండి ఆస్తి విషయంలో వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి.

ఒడిశాలోని బాలేశ్వర్‌లో జూలై 2025లో 52 యేళ్ల వ్యక్తి తన అన్న చేతిలో హత్య చేయబడ్డాడు. వారి మధ్య చాలా కాలంగా భూ వివాదం ఉందని ప్రాథమిక విచారణలో తేలింది. కర్ణాటకలోని హసన్‌లో కూడా జూలై 2025లో ఒక వ్యక్తి తన 70 యేళ్ల తండ్రిని, 50 యేళ్ల సోదరుడిని ఆస్తి తగాదాల కారణంగా హత్య చేశాడు. తండ్రి తన స్వార్జిత ఆస్తిలో కొంత భాగాన్ని అప్పులు తీర్చడానికి అమ్మేయడం దీనికి కారణం. కేరళలోని కన్నూర్‌లో జూలై 2025లో ఇద్దరు సోదరులు తమ చెల్లిని రెండో పెళ్లి చేసుకోకుండా ఆపడానికి ఆమెను హత్య చేశారు. ఆమె నిరాకరించడంతో పెళ్లి ఏర్పాట్ల పేరుతో ఆమెను, ఆమె కాబోయే భర్తను ఇంటికి పిలిచి, ఆమెను కత్తితో పొడిచి చంపారు. హర్యానాలోని గురుగ్రామ్‌లో ఒక తండ్రి తన 25 యేళ్ల కూతురును జూలై 2025లో కాల్చి చంపాడు. ఆమె టెన్నిస్ కోచింగ్‌తో పాటు, ప్రకటనలు, మోడలింగ్‌లో కెరీర్ కొనసాగించాలనే కోరికపై కుటుంబంలో విభేదాలు ఉండటం దీనికి ఒక కారణం అని తెలుస్తోంది. సమాజం తన కూతురు సంపాదనపై వ్యాఖ్యలు చేస్తోందని అతను ఆందోళన చెందాడు.



ఇటీవల కాలంలో కేరళలో తల్లిదండ్రులను పిల్లలు చంపే కేసులు పెరుగుతున్నాయని వార్తలు వచ్చాయి. దీనికి కారణాలు మాదకద్రవ్యాల వ్యసనం, డిజిటల్ ప్రపంచ ప్రభావం, సామాజిక దూరం, తక్షణ కోరికల నెరవేకపోవడం... వంటివి అని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 25 యేళ్ల కొడుకు తల్లిని డబ్బు కోసం చంపిన కేసు, మరొక 28 యేళ్ల కొడుకు తండ్రిని చంపిన కేసులు 2025 ఫిబ్రవరి 25న వెలుగు చూశాయి. నాగపూర్‌లో ఒక ఇంజినీరింగ్ విద్యార్థి తన తల్లిదండ్రులను విద్య, వృత్తిపరమైన భేదాభిప్రాయాల కారణంగా హత్య చేసిన కేసు 2025 జనవరిలో వార్తల్లో నిలిచింది. ఇక్కడ డబ్బు కంటే భేదాభిప్రాయాలు ప్రధాన కారణం. మహారాష్ట్ర కొల్హాపూర్‌లో సునీల్ రమా కుచ్‌కొరవి (38) అనే వ్యక్తి మద్యానికి బానిస అయ్యాడు. తన తల్లి డబ్బులు ఇవ్వలేదన్న ఆగ్రహంతో ఆమెను కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన 2017 ఆగస్టు 28న జరిగింది. సునీల్ తన తల్లి శరీరాన్ని ముక్కలుగా చేసి, కొన్ని భాగాలను ఉడికించేందుకు యత్నించాడు. ఈ కేసులో ట్రయల్ కోర్టు సునీల్‌కు మరణశిక్ష విధించగా, బాంబే హైకోర్టు 2024లో ఈ తీర్పును సమర్థించింది. ఈ హత్యను హైకోర్టు 'అత్యంత అసాధారణ నేరం'గా వర్ణించింది. నెల్లూరు జిల్లాలో ఒక కొడుకు తన తల్లిదండ్రులను చంపడానికి సుపారీ ఇచ్చిన కేసు 2022 అక్టోబర్ 30న వెలుగులోకి వచ్చింది. ఇది కేవలం డబ్బు కోసమే అని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కల్లూరి నర్సింహారావు అనే వ్యక్తి తాగుడుకు బానిసై, డబ్బుల కోసం తన తల్లి కల్లూరి పగడమ్మ (75)ను రోకలిబండతో కొట్టి హత్య చేసి తల్లి మెడలోని బంగారు కాసులను తీసుకుని పరారీ అయ్యాడు. ఈ ఘటన 2021లో తెలంగాణ భద్రాది కొత్తగూడెంలో దుమ్ముగూడెం మండలం రామచంద్రుని పేటలో జరిగింది. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం నడిపూరికల్లాలులో రాజశేఖర్ అనే వ్యక్తి తన తల్లిదండ్రులు అప్పలనాయుడు (55), జయ (45)లను ఆస్తి విషయంలో తన చెల్లెలికి వాటా ఇవ్వడంపై కక్షతో హత్య చేశాడు. తెలంగాణ నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జలాల్‌పూర్‌లో మక్కపల్లి సాయిలు అనే వ్యక్తి పింఛన్ డబ్బుల కోసం తన తల్లి మక్కపల్లి సాయవ్వ (57)ను కుర్చీ, బండరాయితో కొట్టి హత్య చేశాడు. సాయవ్వ ప్రభుత్వ పింఛన్‌తో జీవనం సాగిస్తుండగా, సాయిలు ఆ డబ్బులు తనకు ఇవ్వాలని గొడవపడి ఈ దారుణానికి పాల్పడ్డాడు.

ఈ హత్యలు కేవలం డబ్బు/ఆస్తి వంటి భౌతిక విషయాల కోసం జరిగాయి, ఇవి తల్లిదండ్రుల పట్ల కనీస గౌరవం, ప్రేమ, బాధ్యత లేకపోవడాన్ని సూచిస్తాయి. కానీ ఈ ఘటనలు ఆ విలువలకు విరుద్ధంగా ఉన్నాయి.

సమాజంలో ఆర్థిక ఒత్తిడి, వ్యసనాలు (మద్యం, డ్రగ్స్), నైతిక క్షీణత వంటి కారణాలు ఇటువంటి నేరాలకు దారితీస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. భారతదేశంలో ఇటువంటి హత్యలకు భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 302 కింద జీవిత ఖైదు లేదా మరణ శిక్ష విధించవచ్చు. అయినప్పటికీ మానవతకు మచ్చగా మిగిలే ఇటువంటి నేరాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంకా అక్కా-తమ్ముడు, అన్నా-చెల్లెళ్ళు, తండ్రీ-కూతురు, ఉపాధ్యాయులు-విద్యార్థిలు ఇత్యాది వారి మధ్య అక్రమ సంబంధాలు, మానభంగం చేసిన సంఘటనలు, ప్రేమ వివాహాలు ఇష్టం లేక పరువు హత్యలు.. ఇలాంటివన్నీ మానవత్వానికే కళంకంగా మారిపోయాయి. అధిక కట్నం కోసం కోడళ్లను రాచి రంపాన పెట్టే అత్తమామలు, తల్లిదండ్రులతో పాటు అత్తమామలను వృద్ధాశ్రమాలకు వెళ్లగొట్టే సంతానం.. ఇలా చెప్పుకుంటూ పోతే దానవత్వం ఎంతగా పెరిగిపోతుందో సునాయాసంగా అర్థం చేసుకోవచ్చు. దీన్ని బట్టి మానవత్వం చిరునామా మటుమాయమౌతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

### మానవత్వపు విలువలు పెంచడానికి పరిష్కార మార్గాలు

మానవత్వపు విలువలు అంటే దయ, కరుణ, గౌరవం,

సమానత్వం, నిజాయితీ వంటి లక్షణాలు. ఈ విలువలు సమాజంలో పెరగడానికి అనేక మార్గాలు ఉన్నాయి.

చిన్నప్పటి నుండే పాఠశాల విద్యలో మానవత్వపు విలువల గురించి బోధించడం చాలా ముఖ్యం, నీతి కథల ద్వారా సహానుభూతిని పెంపొందించే కార్యకలాపాలు, సామాజిక సేవ వంటివి పాఠ్యప్రణాళికలో భాగం కావాలి. పెద్దలకు కూడా విలువలతో కూడిన జీవితం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడానికి వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించవచ్చు. సినిమాలు, టీవీ కార్యక్రమాలు, సోషల్ మీడియా వంటివి మానవత్వపు విలువలను ప్రోత్సహించే కంటెంట్‌ను ప్రచారం చేయాలి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. వారు ప్రదర్శించే దయ, గౌరవం, నిజాయితీ పిల్లల పెంపకంలో కీలక పాత్ర పోషిస్తాయి. కుటుంబంలో తరచుగా విలువలు, నైతికత గురించి చర్చించడం, ఇతరుల పట్ల సానుభూతిని పెంపొందించడం చాలా అవసరం. కుటుంబంతో కలిసి స్వచ్ఛంద కార్యక్రమాలలో పాల్గొనడం వల్ల ఇతరులకు సహాయపడే తత్వం అలవడుతుంది. కమ్యూనిటీ కార్యక్రమాలు, పండుగలు, స్వచ్ఛంద కార్యక్రమాల ద్వారా ప్రజలు ఒకరికొకరు దగ్గరవడం, పరస్పర సహాయం చేసుకోవడం అలవాటు చేసుకోవాలి. కులం, మతం, ప్రాంతం, లింగం వంటి భేదాలు లేకుండా అందరినీ సమానంగా చూడటం, గౌరవించడం చాలా ముఖ్యం. సమాజంలో న్యాయం, సమానత్వం నెలకొల్పడానికి కృషి చేయడం మానవత్వపు విలువలను పెంపొందిస్తుంది. వివక్షను తొలగించడం, బలహీన వర్గాలకు మద్దతు ఇవ్వడం అవసరం. వ్యక్తి తన బలాలు, బలహీనతలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడం ద్వారా ఇతరుల పట్ల మరింత సానుభూతిని కలిగి ఉంటాడు. మనం పొందిన వాటికి కృతజ్ఞత కలిగి ఉండటం, ఇతరులకు సహాయం చేయడానికి ముందుకొచ్చేలా చేస్తుంది. ఇతరులను క్షమించడం, గత తప్పులను వదిలివేయడం వల్ల వ్యక్తిగత శాంతి, ఇతరుల పట్ల సానుభూతి పెరుగుతాయి. మానవత్వం, సమానత్వం, నీతిని ప్రోత్సహించే వ్యక్తులను ఆదర్శంగా చూపడం, సినిమాలు, సీరియల్స్, సామాజిక మాధ్యమాల ద్వారా సద్గుణాలను ప్రచారం చేయడం, తల్లిదండ్రులు పిల్లలకు చిన్న వయస్సు నుండే దయ, గౌరవం, నిజాయితీ వంటి విలువలను నేర్పడం, కుటుంబ సభ్యుల మధ్య సమయం గడపడం, సమస్యలను కలిసి పరిష్కరించడం ఇత్యాదివి చేయడం వల్ల మానవతా విలువలు కొంతలో కొంత పెరుగుతాయి.

కష్ట సమయాల్లో ఒకరికొకరు అండగా నిలబడటం ఇప్పటికీ భారతీయ కుటుంబాలలో ఒక బలమైన లక్షణం. కుటుంబ సంబంధాలలో మానవతా విలువలు తగ్గుతున్నాయనేది ఒక సంక్లిష్టమైన అంశం. దీనికి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాలు దోహదపడుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి కుటుంబ సభ్యుల మధ్య పరస్పర అవగాహన, సమయం కేటాయింపు, సంప్రదాయ విలువలను గౌరవించడం అవసరం. వృద్ధుల పట్ల, ముఖ్యంగా తల్లిదండ్రుల పట్ల నిరక్ష్యం పెరుగుతోందని కొన్ని సంఘటనలు సూచిస్తున్నాయి. వారిని ఒంటరిగా వదిలేయడం, ఆదరించకపోవడం వంటివి మానవతా విలువలు తగ్గుతున్నాయనడానికి నిదర్శనం. మానవుడు చంద్రునిపై అడుగుపెట్టాడు. అంతరిక్ష పరిశోధనలలో ఎంతో అభివృద్ధి సాధించడం నిజంగా గొప్ప విషయం. ఇది మానవ మేధస్సు, పట్టుదలకు నిదర్శనం. ఇంత అభివృద్ధి దిశగా పయనించిన మనుషుల మధ్య ప్రేమ, కరుణ, దయ, సహనం, సమానత్వం వంటి మానవతా విలువలు క్షీణించడం ఆందోళన కలిగిస్తోంది.

ఆటవిక నీతిని అనుసరించే ఆదిమానవులే మానవత్వంతో బతికారనేది అనేకమంది పరిశోధకులు తేటతెల్లం చేశారు.



ఇంత నాగరికత పెరిగిన తరువాత కూడా కులమతాల మధ్య కుమ్ములాటలు, గ్రామాల మధ్య వైషమ్యాలు, దేశాల మధ్య శత్రుత్వం, ప్రతి ఒక్కరూ ఆధిపత్యం పోరుకోసం ఒకరిపై మరొకరు పెత్తనం చెలాయించి పైచేయిగా ఉండాలనే కాంక్ష.. ఇత్యాది స్వార్థపూరిత అంశాలను నరనరాన జీర్ణించుకుని మానవత్వానికి చరమగీతం పాడి వ్యక్తిగత స్వార్థంతో క్షణ క్షణం ఒక యుద్ధమే చేస్తున్నారు.

మనిషి జీవితం గాలిబుడగలాంటిది. అది ఏ క్షణం గాల్లో కలిసిపోతుందో ఎవరూ చెప్పలేరు. క్షణభంగురమైన ఈ జీవితం కోసం మానవత్వాన్ని మంటకలిపే పనులు చేస్తూ కొందరు తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఇటువంటివారు తాత్కాలికంగా స్వలాభం పొందినప్పటికీ భావితరాల వారి దృష్టిలో చరిత్రహీనులుగానే మిగిలిపోతారు. మానవత్వాన్ని మంటకలుపుతున్న ఈ దుష్టశక్తులను భావితరాలు క్షమించవు.. అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి కాదు. కాబట్టి మానవత్వాన్ని బతికించడం మానవ జన్మ ఎత్తిన ప్రతిఒక్కరి బాధ్యతగా భావించి నడచుకోవాలి.

సింగిల్ పేజీ కథ

# కన్న ప్రేమ

పుట్టపర్తి బస్టాండ్‌లో గంటసేపు నుంచి కూర్చున్నాను. నేను వెళ్ళాల్సిన ధర్మవరం బస్సు ప్లాట్ ఫాంలోకి ఇంకా రాలేదు. సమయం పది కావస్తోంది. అటూ ఇటూ చూస్తూ ఒక్కడినే కూర్చుని వున్నాను "అనంతపురం వెళ్ళే బస్సు ఇంకా రాలేదా?" ఎవరో అడిగినట్టు అనిపిస్తే తల పైకెత్తి చూసాను. చేతిలో బ్యాగు పట్టుకుని ఒక అమ్మాయి నా పక్కనే నిలబడింది "ఇంకా రాలేదమ్మా?" అన్నాను నిరుత్సాహపడిపోతూ. నా పక్కనే కూర్చుంది "చదువుతున్నావా తల్లీ?" ఎంతో ఆప్యాయంగా పలకరించాను.

"లేదు" అన్నట్టు తల అడ్డంగా ఊపింది. అరగంట గడిచిపోయింది. తిన్నగా తల తిప్పి అమ్మాయిని గమనించాను. ఏదో తేడా కనిపించింది.. ఆమె కంట్లో నీళ్ల ఒక్కొక్క బొట్టుగా రాలడం చూసాను "ఎందుకమ్మా ఏడుస్తున్నావ్?" అడగాలనిపించి అడిగాను. "ఏం లేదు" అన్నట్టు తల పంకించింది. "పర్వాలేదు చెప్పమ్మా, నేను చేయగలిగిన సాయమైతే తప్పకుండా చేస్తాను" నా మాటకు సమాధానం ఇవ్వలేదు "నీ పేరేమిటి?" అని అడిగాను. "పద్మ" అంది కన్నీళ్లు తుడుచుకుంటూ. కాస్త ప్రయత్నం చేస్తే ఎట్టకేలకు చెప్పడం మొదలు పెట్టింది.

..........

మిద్దె పైన కూర్చుని సెల్ ఫోన్ చూస్తూ వుంది పద్మ. "అస్తమానం సెల్‌ఫోన్ తప్ప వేరే ధ్యాస లేదు" అంటూ విసుక్కుంది పార్వతమ్మ. "వచ్చి భోంచేయ్ పద్మా, నేను పనికి వెళ్లాలి" అంది పార్వతమ్మ. రోజూ కూలి పనికి వెళుతుంది. భర్త శివప్రసాద్ అనారోగ్యంతో ఏడాది కిందటే మరణించాడు. పద్మ చదువుతో పాటు ఇంటి బాధ్యత అంతా పార్వతమ్మే చూసుకుంటోంది. ఉన్న ఒక ఎకరం భూమిలో పంట వేసే స్థోమత లేక బీడు పెట్టింది. ప్రాణమంతా ఒక్కగానొక్క కూతురిపైనే పెట్టుకుని జీవిస్తోంది.



కొద్ది రోజులు గడిచిపోయాయి.. ఫేస్‌బుక్‌లో దివాకర్ అనే పర్సన్ పద్మకు బాగా క్లోజ్ అయ్యాడు. క్రమంగా వీరి మధ్య స్నేహం కాస్త ప్రేమగా మారింది. ఇదే విషయం పార్వతమ్మతో చెప్పింది పద్మ. "ఎవర్ని పడితే వాళ్ళను నమ్మకు పద్మా, పైకి బాగానే కనిపిస్తారు జాగ్రత్త" అంది పార్వతమ్మ. అయినా తల్లి మాటను బేఖాతరు చేసి దివాకర్‌తో చనువుగా ప్రవర్తించడం మొదలు పెట్టింది "నిన్ను మాట్లాడకుండా క్షణం కూడా వుండలేనురా" అనేంత పిచ్చి ప్రేమ పద్మలో ముదిరిపోయింది. రోజు రోజుకూ పద్మలో మార్పు కనిపిస్తుంటే పార్వతమ్మ ఆలోచనలో పడింది.

ఇలా కొన్నాళ్ళు గడిచిపోయింది. ఆరోజు తెల్లవారుజామున నిద్ర లేచింది పార్వతమ్మ. పద్మ కనిపించలేదు. పక్కన ఒక చీటి పడుంది, తీసి చదివింది "సారీ అమ్మా! నాకు దివాకర్ అంటే చాలా ఇష్టం. ఇప్పుడు తన దగ్గరకే వెళ్తున్నాను, తననే పెళ్లి చేసుకుంటాను. నా కోసం వెదికే ప్రయత్నం చేయకు. నాకు పెళ్ళి చేసే స్థోమత నీ దగ్గర లేదు, చదివించే శక్తి కూడా నీకు లేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నాను. కచ్చితంగా ఎప్పుడో ఒకరోజు వస్తాను నన్ను క్షమించు" అని రాసి పెట్టి వెళ్ళిపోయింది. గుండెలవిసేలా రోదించింది పార్వతమ్మ. ఉన్న ఒక్క తోడు కూడా దూరమైపోయేసరికి తీవ్రమైన ఆలోచనతో అనారోగ్యం పాలై మంచాన పడింది పార్వతమ్మ.

..........

దివాకర్ ప్రేమలో పడి తనకు ఒక తల్లి వుందన్న సంగతి మర్చిపోయింది పద్మ. ఒకరోజు ఊరి నుంచి ఫోన్ వచ్చింది "మీ అమ్మకు ఆరోగ్యం క్షీణించింది నిన్నే కలవరిస్తోంది ఒక్కసారి వచ్చిపో పద్మ" అని పక్కింటివాళ్లు చెప్పినా కూడా పద్మలో చలనం రాలేదు. తొలి మోజులో కొన్నాళ్ళు గడిచిపోయింది. కొత్త పాతైంది మోజు తీరిపోయింది. ఇప్పుడు కావాల్సింది ప్రేమ కాదు బతకడానికి డబ్బు కావాలి. దివాకర్‌లో మార్పు మొదలైంది "ఊరి దగ్గర ఉన్న ఆ ఎకరం పొలం అమ్మి డబ్బులు తీసుకురా" అంటూ పద్మను వేధించడం మొదలుపెట్టాడు "అమ్మను వదులుకుని నిన్ను నమ్మి నీ దగ్గరకు వస్తే ఇలా చేయవచ్చా దివాకర్" అంటూ కన్నీరు కార్చింది పద్మ "ప్రేమ వేరు పెళ్లి వేరు. కాలం ఎప్పుడూ ఒకేలా వుండదు. వెళ్ళి చెప్పిన పని చేసుకురా" అంటూ పద్మకు సంబంధించిన బట్టల బ్యాగు బయటికి విసిరి, తలుపులు మూసేసాడు దివాకర్.

..........

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను నేను "ఆకర్షణ వేరు ప్రేమ వేరు మోసపోయావు తల్లీ" అని అంటుండగానే అనంతపురం బస్సు రానే వచ్చింది. హడావుడిగా వెళ్లి బస్సు ఎక్కేసింది పద్మ. సాయంత్రానికి ఊరు చేరుకుంది. ఇంటికి తాళం వేసి వుంది. పక్కింటి రత్నయ్యను అడిగింది "మీ అమ్మ నీ కోసం శ్మశానంలో ఎదురు చూస్తోంది, వెళ్లు" ఆ మాటతో కళ్ల తిరిగిపోయాయి పద్మకు. "నీ పిచ్చి ప్రేమ మీ అమ్మను బలి తీసుకుందమ్మా, కచ్చితంగా చెప్పాలంటే నీ ప్రేమపిచ్చి మీ అమ్మను మానసికంగా బాధించి చివరికి హత్య చేసింది. వెళ్ళు వెళ్ళి చూడు" అంటూ రత్నయ్య కన్నీళ్ల పెట్టుకుంటూ వెళ్ళిపోతుంటే పద్మ నిర్జీవిలా నిలబడిపోయింది. "ఆకర్షించే ప్రేమ ముందు కన్న ప్రేమ ఓడిపోయింది. అవసరానికి రంగులు మార్చే ప్రేమ ముందు జన్మనిచ్చిన ప్రేమ ఓటమి పాలైంది.. చివరికి మోసమే గెలిచింది. నాపై ఆశలు పెట్టుకున్న కన్న ప్రేమ కనుమరుగైపోయింది.." మనసులో అనుకుని కన్నీటిపర్యంతమైంది పద్మ అక్కడే కూలబడిపోయింది.

- నరెద్దుల రాజారెడ్డి

# ఈ వారం కవిత్వం

## వీడ్కోలు

ఉద్యోగానికి వీడ్కోలు పలికాక
శరీరం బద్దకానికి
స్వాగతం పలుకుతుంది.
సమయానికి అందే టీ
కాస్త ఆలస్యమవుతుంది
రోజు పెట్టే భోజనంలో
కొంచెం కొంచెం ప్రేమ తగ్గి
రుచి పూర్తిగా కోల్పోతుంది.

ఆలోచించాలి గాని
వీడ్కోలు కృత్రిమమైనదేమీ కాదు
సహజమైనదే
అయినా..
వీడ్కోలు ఉద్యోగానికి కానీ
జీవితానికి కాదుగా.
ఆస్వాదించే మనసునిండాలి గాని
జీవితమెప్పుడూ రుచిగానే ఉంటుంది.

జీవితమంతా
నువ్వు అనుకోవడంలోనే ఉంది
ఎలా అనుకుంటే అలా
రోండా బర్న్ "రహస్యం" ఎవరైనా
అప్లై చేసుకోవచ్చు.
మనసుండాలి కానీ
మలిదశ కూడా
మహాద్భుతంగా వెలుగొందుతుంది.

ఆలోచనుండాలిగానీ
నీ జీవితానుభవంతో
కొత్త తరానికి నువ్వు
దారిదీపమవ్వచ్చు.
కవిగానో రచయితగానో పక్వానికొచ్చి
చెడు ఆలోచనల నుండి
సమాజాన్ని మంచి వైపు దారి
మళ్లించవచ్చు.

తపన ఉండాలి కానీ
వెన్నుపూస వంగేదాకా
ఆలోచనల తరంగాలతో
ప్రతిరోజూ నువ్వు కొత్తగా
ఉదయించవచ్చు.
వీడ్కోలు ఉద్యోగానికే కానీ
జీవితానికి కాదు.

– ఎన్.నరేశ్ చారి

## మనసు తెరలు

కుశల ప్రశ్నల పయనంలో
మనసు మమతల పలుకరింతలు
చిగురింతలౌతాయి.
అవి అందమైన కొత్త రూపం
సంతరించుకుంటాయి.
తలపులు తలుపుల తెరలు తీసి
జాలువారే వెన్నెల రేఖల సోనలై
ప్రేమానుభూతికి
లోనౌతాయి మదివాకిట్లో ఒక్కోసారి.
అంతరాలలో దాగిన
స్నేహతత్వం పెల్లుబికి
కరుణ దయార్ద్ర రసాలు
కురిపిస్తుంది మనసు.
స్నేహానికి అర్రులు చాచే
మనోనేత్రాలు క్షణ కాలమైనా
స్వచ్ఛమైన చెలిమి చేతులు
కలుపుతానంటాయి.



– ఏ.వి.వి.ప్రసాద్ శర్మ

## చూడాలని ఉంది..

మా ముంగిట్లో విరిసిన
మల్లెపందిరిపై
ప్రతి రోజూ సాయంత్రం వేళలో
ఎన్నో పిచ్చుక
మిత్రులు
చేరేవి.
నేను
పూలకోసం
వెళ్లినప్పుడు
వాటి భాషలో అవి మాట్లాడుకునే
కిలకిలారావాలు మదికి హాయినిచ్చేవి.

అదే సమయంలో బిలబిలమంటూ
ఇరుగు పొరుగు పిల్ల తెమ్మెరలన్నీ
ఆ పందిరి కింద చేరి అల్లరి చేసేవి
పూచిన ఆ మల్లెమొగ్గలు కావాలని
ఈ చిన్నారి పిల్లమొగ్గలు
అడుగుతుంటే
వారికి ఆ పూల పరిమళం
పంచేదాన్ని.
కొమ్మ కొమ్మల్లో ఆ
పసిప్రాయం
దోబూచులాడుతుంటే
నా హృదయం కూడా
వారితో
పాటు కాసేపు ఆడుకుంటూ
ఆ దాగుడుమూతల్లో నేనే
దొరికిపోయినంత
సంబరపడిపోయేదాన్ని.

ఇటీవలే వచ్చిన ఓ చరవాణి బూచోడు
బాల్యాన్ని వాడి చెరలో
బంధించేసాడు
ఆ పసిమనసులను పూర్తిగా
తనవైపు తిప్పుకున్నాడు
స్వేచ్ఛగా తిరిగే ఆ సీతాకోకచిలుకలను
మళ్ళీ
ఇంతవరకూ
నేను
చూడనేలేదు.
ప్రతీ రోజూ నా చూపులు
వారికోసం వెతుకుతూనే ఉన్నాయి.
ఈ సెల్ టవర్లతో పక్షుల కబుర్లు
కూడా కనుమరుగైపోతున్నాయి

ఇప్పుడు టచ్ స్క్రీన్లపై మునివేళ్ళ
సవ్వడి తప్ప
చిరు పలకరింపులు, గువ్వల ఊసులు
లేవు
పసితనం, పక్షితనం మళ్ళీ రెక్కలు



విప్పితే
నా కనులారా చూడాలని వుంది!

– ములుగు లక్ష్మీ మైథిలి

విందు-పసందు

## మునగాకు తెలగ పిండి కూర

**కావలసిన పదార్థాలు:** మునగాకు 4 రెమ్మలు లేదా 3 కప్పుల ఆకు, తెలగపిండి 2 కప్పులు పోపుకి కావల్సిన పదార్థాలు: మినపప్పు స్పూను. సెనగపప్పు ఒక స్పూను ఆవాలు ఒక స్పూను జీలకర్ర ఒక స్పూను ఎండుమిర్చి 3, 4, పచ్చిమిర్చి 2, 3, కరివేపాకు రెబ్బలు ఇష్టాన్ని బట్టి వెల్లుల్లిరెబ్బలు 6, ఉప్పు (తగినంత).



**తయారు చేసే విధానం:** ముందుగా స్టౌమీద బాణలి పెట్టి 2,3, చెంచాల నూనె వేసి సన్న సెగ మీద ఆవాలు వేసుకుని పోపు చిటపటలాడాక పచ్చిమిర్చి ముక్కలు, కరివేపాకు వేసి, వేగేక మునగాకు వేసుకొని బాగా కలిపాలి. అర కప్పు నీళ్ల పోసి ఉప్పు తగినంత వేసి 2, 3, ఉడుకులు వచ్చాక కొద్దికొద్దిగా కలుపుతూ తెలగపిండి వేసుకోవాలి. బాగా కలిసి మూత పెట్టి 5-10 ని॥లు సన్న సెగమీద మగ్గనివ్వాలి. (మధ్య మధ్య మూతతీసి కలుపుతూ ఉండాలి. తెలగపిండితో దగ్గరపడి కూర పొడి పొడిగా ఉంటుంది.

## కడా ప్రసాదం (గోధుమహల్వా)



**కావలసిన పదార్థాలు:** గోధుమపిండి ఒక కప్పు, పంచదార ఒక కప్పు, నెయ్యి ఒక కప్పు, జీడిపప్పులు 5, కిస్‌మిస్‌లు 5, ఏలకుల పొడి స్పూన్.

**తయారు చేసే విధానం:** స్టవ్ వెలిగించి బాణలి పెట్టుకోవాలి. వేడెక్కేక ముందుగా నెయ్యి వేసుకుని, తరువాత గోధుమపిండిని వేసి ఉండ కట్టకుండా బాగా కలుపుతూ, ఈ మిశ్రమానికి పంచదార చేర్చాలి. ఈ పదార్థాలు బాగా కలుపుతూ కొంచెం కొంచెంగా నీరు పొయ్యాలి. బాగా కలుపుతూ ఉంటే కొంచెం ముద్దగా వస్తుంది. నీరు ముందే ఎక్కువగా పోయకుండా కొద్దికొద్దిగా ముద్దగా, దగ్గర పడేవరకు పోసుకోవాలి. తరువాత నేతిలో వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్ వేసుకొని, ఏలకుల పొడి కలుపుకోవాలి. పంచదార బదులు బెల్లంతో కూడా చేయవచ్చు.

## చిలకడ దుంప బూరెలు

**కావలసిన పదార్థాలు:** చిలకడ దుంపలు 1/2 కేజీ, ఏలకులు 10.(పొడి చేసి ఉంచుకోవాలి), మినపప్పు+బియ్యం (లేదా) మైదాపిండి + బియ్యం పిండి, బూరెలు వేయించడానికి సరిపడినంత నూనె.



**తయారు చేసే విధానం:** చిలకడ దుంపలను మట్టి పోయేలా బాగా కడిగి కుక్కర్‌లో ఉడికించుకోవాలి. ఉడికిన దుంపలను తొక్కలు తీసి ముద్దగా చేసుకుని, బెల్లం కోరుని, దుంపల ముద్దలో కలిపి ఏలకుల పొడి వేసుకుని బాణలిలో 3,4, చెంచాల నెయ్యి వేసి బాగా కలిసేలా, ఉండలా అయ్యేలా కలుపుకోవాలి. (బెల్లం పాకం పట్టి దుంపల ముద్దను కలుపుకోవచ్చు, అంతా చిన్న ఉండలు చేసి పక్కన పెట్టుకోవాలి) పైన చెప్పిన మినప్పప్పు, బియ్యం కలిపి 2 గంటలు నాననిచ్చి మెత్తగా గ్రైండ్ చేసుకుని తోపుపిండిగా ఉంచుకోవాలి. బాణలిలో నూనె కాగాక, చేసి పెట్టుకున్న ఉండలను తోపుపిండిలో ముంచి వేడి నూనెతో వేసి వేగాక ప్లేట్‌లోకి తీసుకోవాలి. పూర్ణం బూరెలలాగే చేసుకోవాలి.

## కీరా దోస పచ్చడి

**కావలసిన పదార్థాలు:** కీరా దోసకాయలు 2, చిన్న కొబ్బరి ముక్కలు లేదా కోరిన కోరు ఒక కప్పు, తగినంత ఉప్పు, నిమ్మకాయ ఒకటి, కారాన్ని బట్టి 4, 5 పచ్చి మిరపకాయలు, సుమారు ఒక కప్పు తరిగిన కొత్తిమీర తురుము, చెంచాడు మినపప్పు, కొంచెం ఆవాలు.

**తయారు చేసే విధానం:** కీరా దోసను చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. పచ్చిమిర్చి, కొబ్బరి, ఉప్పు, కొత్తిమీరను మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకుని తరిగి కీరాముక్కలలో ఈ ముద్దని కలుపుకుని నిమ్మరసాన్ని పిండుకోవాలి. కావలసిన వారు మినప్పప్పు, ఆవాలు కొంచెం నూనెతో పోపు వేసి కలుపుకోవచ్చు. లేకపోయినా బాగానే ఉంటుంది. ఆరోగ్యానికి చాలా మంచిది.



- రాజశేఖరి శాంతిశ్రీ

# ఉన్నత స్థానంలో బొబ్బిలి వీణ



జాతీయ స్థాయి అవార్డు సాధించి బొబ్బిలి వీణ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. ఆనాటి బొబ్బిలి సంస్థానాధీశులు ప్రారంభించిన హస్తకళ నేటికీ తిరుగులేని ఉత్పత్తిగా దశ దిశలు వ్యాప్తి చెందుతోందనడంలో అతిశయోక్తి కాదు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం గొల్లపల్లి గ్రామానికి దేశ విదేశాలలో బొబ్బిలి వీణ ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించింది. ఇటీవల వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డు బొబ్బిలి వీణ ఎంపిక కావడంతో దేశ చరిత్రలో బొబ్బిలి వీణ ప్రాచర్యం మరింత ఇనుమడింపచేస్తుందనడంలో సందేహం లేదు. ఈ అవార్డు విజయనగరం జిల్లా కలెక్టర్ బి అంబేద్కర్ కొత్త ఢిల్లీ ప్రగతి మైదానంలో కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి ఫియూస్‌గోయల్ చేతుల మీద అందుకున్నారు. ఈ కార్యక్రమం ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా రాష్ట్రమంత్రి జితిన్ ప్రసాద్. బీసీ సంక్షేమ మంత్రి చీఫ్ సెక్రటరీ ఆర్‌పి సిసోడియా, చేనేత జౌవులశాఖ శాఖ కమీషనర్ ఆర్వి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. బొబ్బిలి వీణకు ఎంతో విశిష్ట అవార్డు రావడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తదితరులు సంతోషం వ్యక్తం చేశారు. వీర బొబ్బిలి చరిత్రలో ఓ ప్రత్యేక పుట ఉన్నట్లే బొబ్బిలి వీణకు ఆ చరిత్రతో పెనవేసుకోనే బంధం ఉంది. సంగీత ప్రియుల హృదయ తంత్రులను మీటడంలో బొబ్బిలి వీణకు మరేదీ సాటిరాదు అనడం అతిశయోక్తి కాదు. ప్రముఖ వీణ నాదకులు వాసా కృష్ణమూర్తి, ఈమని శంకర శాస్త్రి, బాబు జోగులాంబ పద్మిని, శ్రీవాణి.. ఇలా ఎంతోమంది వీణనాద కళాకారులు తమ ప్రతిభకు పదును పెట్టి పలువురు మన్ననలను అందుకున్నది బొబ్బిలి వీణతోనే. బొబ్బిలి వీణలు తయారీ 1959లో ప్రభుత్వం గుర్తించింది. అనేకమంది ప్రజాప్రతినిధులు అధికారుల చొరవతో బొబ్బిలిలో 1994 దివంగత రాజా ఆర్‌విజీకే రంగారావు సౌజన్యంతో తాత్కాలికంగా వీణలు తయారు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 2002లో మున్సిపల్ పరిధిలో గొల్లపల్లిలో రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ పరిధిలో హస్తకళల అభివృద్ధి కేంద్రాన్ని శాశ్వత ప్రాతిపదికన అప్పటి అటవీ శాఖ మంత్రి పెద్దింటి జగన్‌మోహనరావు, కలెక్టర్ నాగిరెడ్డి, సర్వసిద్ధి సర్వసిద్ధి బ్రహ్మం మాస్టరు కృషితో ఏర్పాటు చేశారు. బొబ్బిలి గొల్లపల్లి, వాడాడ గ్రామాలకు చెందిన సుమారు యాభై కుటుంబాలకు చెందిన 200 మంది హస్త కళాకారులు బొబ్బిలి వీణలను తయారు చేయడంలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. వడ్రంగం, కమ్మరం, దంతపు మెట్లు కట్టడం, సప్తస్వరాలను వీనుల విందుగా అందించే విధంగా తీగలను బిగించడం వంటి జాగ్రత్తలతో బొబ్బిలిలో వీణలను తయారు చేస్తారు.

నైపుణ్యంతో ఇక్కడ కళాకారుల ప్రత్యేకత పనస చెట్టు నుంచి సేకరించిన కలపతో అతుకులు లేకుండా యాకండి కర్రతో తయారు చేయడమే బొబ్బిలి వీణ ప్రత్యేకత. ఇత్తడి లేక కంచుతో మెట్టు తయారు చేసి ఇత్తడి కర్రతో కుటీలు అమర్చి సుస్వరాలు పలికించడానికి కళాకారులకు కాస్త జ్ఞానం కూడా అవసరమని చెప్పవచ్చు. బొబ్బిలి వీణలంటే వాయిద్య కారులకు ఎంతో మక్కువ. నూజివీడు, పిఠాపురం, తంజావూరు, మైసూర్‌లలో తయారవుతున్నప్పటికీ బొబ్బిలి వీణ ప్రత్యేకత మాత్రం చెక్కుచెదరక పోవడం విశేషం. నేటి ఆధునిక సమాజంలో పాశ్చాత్య సంగీత వాయిద్య పరికరాలు పట్ల నాటి సంగీతంపై ప్రజలకు మోజు ఉన్నప్పటికీ అగ్ర హీరోలు నటించే సినిమాల్లో వీణల పాటలకు ఇటీవల పెద్ద ఎత్తున ఆదరణ లభించడం గమనార్హం. సంగీత పరిజ్ఞానం లేనివారు సైతం తమ ఇళ్లల్లో బహుమతి వీణలు అలంకరణగా పెట్టుకునేందుకు మోజు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర గవర్నర్లు రాష్ట్రపతి నివాస భవనానికి వచ్చిన ప్రత్యేక అతిథులకు బొబ్బిలి వీణను బహుకరించాలని అధికారికంగా నిర్ణయించడం విశేషం. పలు దఫాలు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జరిగే హస్తకళా ప్రదర్శనలకు బొబ్బిలి వీణలు కూడా వెళ్లి ప్రత్యేకతను చాటుకున్నాయి. అమెరికా అధ్యక్షుని హోదాలో బిల్ క్లింటన్ రాష్ట్రానికి విచ్చేసినప్పుడు బొబ్బిలి వీణను చూసి అబ్బురపడి వీణ తయారీ కళాకారులు అమెరికా రావాలని సాధరంగా ఆహ్వానించారు. అయితే అధికారుల సమన్వయం లోపంతో కారణంగా ఈ సదవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.



## ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే

వీణల్లో మొత్తం తొమ్మిది రకాలు ఉన్నాయి. ప్లెయిన్ నెమలి, సితార, తంబుర, స్వర మండలి, వయోలిన్, తబలా, సన్నాయి, డోలు, ఫ్లూటు ఆకారాల్లో వీణలు తయారు చేస్తున్నారు. ఒక్కొక్క కళాకారుడు 5 నుంచి 6 ఆరు గిఫ్ట్ వీణలను తయారు చేయడానికి 10 నుంచి 15 రోజులు పడుతుందన్నారు. వారు ప్రత్యేక శిక్షణతో తయారు చేస్తారు. వారిచే ఈ కళారూపాలను తయారు చేయడం. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన బొబ్బిలి వీణకు మేధోసంపత్తి హక్కులు, పేటెంట్ హక్కులు మంజూరు చేయాలని చెన్నైలోని జియోగ్రాఫికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సానుకూలంగా స్పందించి ఇందుకు సంబంధించి అధికారుల ఉత్తరం స్థానిక వీణాకేంద్రం చేతికి అందాయి. పేటెంట్ హక్కులతో బొబ్బిలి వీణ మరింత ప్రాచుర్యం పొందింది. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డు నామినేట్ అయిన బొబ్బిలి వీణను కేంద్ర బృంద పరిశీలనకు ఎన్వెస్ట్ ఇండియా టీం వెరిఫికేషన్ 2024లో గొల్లపల్లి గ్రామంలో పర్యటించారు. జేసి అశోక్ కేంద్ర బృంద సభ్యులు చరియన్ ప్రవీణ్ సమీర్ కళాకారులతో ముఖాముఖి చర్చలు జరిపారు.



వీణలు తయారీకి అవసరమయ్యే పనస చెట్టు కలపను ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. పెద్ద వీణలు 12 వేల నుంచి 15 వేల రూపాయలు విలువ ద్వారా అమ్మకాలు జరుగుతున్నాయి. నెలకు ఒకటి రెండు ప్రొఫెషనల్ వీణలు మాత్రమే అమ్ముడు అవుతున్నాయి. 9 అంగుళాల గిఫ్ట్ వీణలు, 17 నెమలి ఆకారపు వీణలు తయారు చేస్తున్నారు.

## వీణల తయారీకి ప్రత్యేక డిపో అవసరం: కేంద్రం ఇన్‌చార్జి అచ్యుతనారాయణ రామసుధాకర్

పనస చెట్లు పెంపకానికి భూమిని ప్రత్యేకంగా కేటాయిస్తామని నాయకులు అధికారులు ఇచ్చిన హామీలు ఇప్పటికి కార్యరూపం దాల్చలేదు. అప్పటి జిల్లా కలెక్టర్ వంద ఎకరాల భూమిని పనస కర్ర పెంపకానికి కేటాయిస్తామని చెప్పడమే మిగిలింది అన్నారు. ప్రత్యేక డిపో ఏర్పాటు చేస్తామన్న హామీని అధికారులు నిలబెట్టుకోలేకపోయారు. సాధారణ వీణల కన్నా గిఫ్ట్ వీణలకే ఎక్కువ మొత్తం పలుకుతూ ఉండడంతో వీటి తయారీలో కళాకారులు నిమగ్నం అయ్యారు. "వీణల తయారీ వలన ఎంత ఆదాయం వస్తుందని?" కళాకారులను ప్రశ్నించారు. హస్త కళాకారుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ "ఈ వీణ తయారీకి పనస ఏకకరణ వినియోగిస్తామనినీ, పెద్ద వీణ తయారీకి ఒక నెల రోజులు పడుతుంది. లక్కతో పాలిష్ చేస్తామన్నారు. పదిహేను వేల రూపాయల వరకు వస్తుందనీ, చిన్న వీణ తయారు చేస్తే పదివేల రూపాయలు వస్తుందని అన్నారు. ఈ కళ పై వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని అలా సాగుతున్నామని" అన్నారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందజేస్తే రానున్న తరాలకు మార్గదర్శకాలుగా ఉండేందుకు మా కళను నిర్విఘ్నంగా సాగిస్తామని కళాకారులు అన్నారు. ఈ కళను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం కలిగే విధంగా మన దేశం నుండి ఉన్నతాధికారులు చొరవ తీసుకుంటే మా కళాకారుల జీవన విధానంలో మార్పు వస్తుందని ఈ కళలను మరింత మెరుగైన సాంకేతిక నైపుణ్యంతో తీర్చిదిద్దడానికి మేమంతా కృషి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ బిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ "ఇటీవల కేంద్ర ప్రభుత్వం వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రోడక్ట్ అవార్డు కేంద్ర మంత్రి చేతుల మీద ఢిల్లీలో అందుకోవడం మన జిల్లాకు ఎంతో గర్వకారణంగా ఉందని" అన్నారు. ఇకపై గొల్లపల్లి వీణ కేంద్ర డెవలప్ గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కార్మికులు కావలసిన నైపుణ్యాన్ని ఇచ్చే సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వానికి నివేదిస్తానని" అన్నారు. బొబ్బిలి వీణతో దేశ విదేశాలలో ప్రాచుర్యం పొందడం మన బొబ్బిలి కళాకారుల కృషి అన్నారు. లేపాక్షి హస్తకళ డెవలెప్‌మెంట్‌పై బొబ్బిలి వీణలపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు తయారు చేసిన వీణలు మార్కెటింగ్ జరిగి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుత గొల్లపల్లి క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ నిర్వాహకుడు ఎస్ రామకృష్ణ "మా పూర్వీకుల నుంచి ఈ విద్యతో మేం జీవనం గడుపుతున్నాం. ప్రపంచ స్థాయి ప్రసిద్ధి చెందిన వీణలు తయారు చేస్తున్నాం కానీ మా కళాకారులకు ప్రభుత్వం నుంచి ఏమాత్రం ప్రోత్సాహం అందకపోవడంతో కొంతమంది కళాకారులు నిరాసక్తి చూపిస్తున్నారని" అన్నారు.



భావితరాలకు ఈ కళపై మక్కువ చూపించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించి గిట్టుబాటు ధర కల్పించి, పనస, కర్రకు విరివిగా లభ్యమయ్యే విధంగా కార్యాచరణ రూపొందించి మా వృత్తికి న్యాయం చేయాలని" కోరారు.

**- కొండ్రవీడి ఆచారి ఆదినారాయణ**





కథ

# అమ్మ మాట వినాలి!

అది ఒక అడవి. అందులో అన్ని రకాల జంతువులూ ఉండేవి. జింక నోటితో కొన్ని ఆకులు తెచ్చి "నీకు ఆటలు ఎక్కువయ్యాయి నువ్వు పెరిగి పెద్దయ్యావు. నీ ఆహారం నువ్వే సంపాదించుకోవాలి. చెట్ల కొమ్మలపైన చూడు రెక్కలు వచ్చిన పక్షులు ఆహారాన్ని ఎలా సంపాదించుకుంటున్నాయో!" అని తన బిడ్డ జింక పిల్లకు చెప్పింది.

అమ్మ మాటలు జింక పిల్లకు నచ్చలేదు. అక్కడ నుండి వెళ్లిపోయింది. అలా ఆకలితో పచ్చటి ఆకుల కోసం ముందుకు సాగింది. జింక పిల్లను నక్క చూసింది. ఈ రోజు ఎలాగైనా ఈ జింక పిల్లను ఆరగించాలి అని ఎదురెళ్లి "ఎక్కడికి వెళుతున్నావు?" అని అడిగింది. అమ్మ కోప్పడ్డ విషయం చెప్పింది జింకపిల్ల. "అమ్మలంతా అంతే! ఆడుకోనివ్వరు. నీకు పచ్చటి ఆకులు దొరికే చోటు చూపిస్తాను.. పద" అని నక్క, జింకపిల్లను తాటి చెట్టు కింది నుంచీ తీసుకెళ్లింది. చెట్టు పైన తాటి పండులోని ముంజలను ఒలిచి తింటూ చూసిన కోతి తన బలమంతా ఉపయోగించి తాటి పండ్ల గుత్తిని తెంపి నక్క మీద విసిరేసింది. అంతే! నక్క నడ్డి విరిగింది.

"కుయ్యో.. మొర్రో" అంటూ అక్కడ నుండి పరుగు తీసింది.

కోతి కిందికి దిగి వచ్చి "నక్క నిన్ను పులి దగ్గరకు తెసుకెళ్లడానికి ప్రయత్నించింది. అసలు ఇక్కడికి ఎందుకొచ్చావు?" అని అడిగింది కోతి.

"అలాగా మామా! నాకు అది తట్టనే లేదు అని, అమ్మ గురించి చెప్పింది.

"అమ్మ మాటలు సద్ది మూటల్లాంటివి. తప్పక వినాలి పద" అని జింక వద్దకు తెసుకెళ్లింది కోతి.

"అమ్మా! కోతి మామ నన్ను కాపాడడమే కాకుండా మంచి మాటలు చెప్పింది.. ఇక నుండి నీ మాటలు వింటాను నీతో వచ్చి ఆహారం సంపాదించుకుంటాను అని అంది జింకపిల్ల. జింక కోతికి కృతజ్ఞతలు చెప్పింది.

**- యు.విజయశేఖర రెడ్డి,** హైదరాబాద్

# కోడి గద్ద వైరం

చాలా కాలం కిందట కోడి, గద్ద ఎంతో స్నేహంగా జీవించేవి. ఒకరోజు గద్ద వాళ్ళ అమ్మగారి ఇంటికి పోతూ– తన ఇంటి తాళం చెవిని కోడికి ఇచ్చి "ఈ తాళంచెవి జాగ్రత్తగా చూస్తూ ఉండు, నేను మా అమ్మ గారి ఇంటికి వెళ్లి నెలలోపు వస్తా" అని చెప్పి వెళ్ళిపోయింది. ఆ రోజు నుండి కోడి ఆ తాళం చెవిని ఎంతో భద్రంగా తన రెక్కల్లో దాచుకుంది. అది అటూ ఇటూ తిరిగేటప్పుడు తాళంచెవి కాస్త ఎక్కడో పడిపోయింది. ఈ లోగా గద్ద వచ్చి "నా తాళంచెవి ఇవ్వమని" అడిగింది. కోడి తన రెక్కలను దులిపి చూడగా కనిపించలేదు. "ఎక్కడో జారి పడిపోయింది" అని చెప్పింది. గద్ద "తాళం చెవిని వెతికే వరకు నీ పిల్లల్ని తింటూనే ఉంటాను" అని శపిస్తూ తిట్టింది. ఇక అప్పటి నుండి కోడికి గద్దకు వైరం పుట్టింది. గద్ద కోడి పిల్లల్ని తన్నుకెళ్లడం, కోడి ఎదిరించడం ఆనాటి నుండి ఆనవాయితీగా వస్తోంది. కోడి తనతో పాటు తన పిల్లలను కూడా తాళం చెవిని వెతకమని చెప్పడంతో కోళ్ల జాతి మొత్తం కనిపించిన ప్రాంతమంతా ముక్కుతో కాళ్లతో గెలకడం, తాళం చెవి కోసం వెదకడం మనం చూస్తున్నదే!

**- కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి**



వార్త ఆదివారం

## బాలగేయం

### చిరునవ్వు

విజేతగా నిలవాలంటే
ఆయుధాలు రెండు పట్టాలి
శ్రద్ధ, పట్టుదలతో చేయాలి
సాధనతోనే ఉండాలి
మౌనంగుంటూ శోధించాలి
చిరునవ్వులతో ఉండాలి



సమస్య సాధనకై నడువాలి
మౌనంగానే వినాలి
ఏకాగ్రతతో ఉండాలి
పలుమార్లు చదవాలి
పెన్నుతోనే రాయాలి
మిత్రులతోనే చెప్పాలి.

- పెందోట వెంకటేశ్వర్లు

## హలో ఫ్రెండ్...

చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
గిరీష్ అంకుల్ సమాధానాలు

ఎ.సుబ్బారావు, నల్లగొండ

**ప్రశ్న: ఆమ్లవర్షం అంటే ఏమిటి?**

**జవాబు:** ఆమ్లాలు, క్షారాల బలాబలాలను పిహెచ్. స్కేల్ మీద 0 నుంచి 14 సంఖ్యల వరకూ లెక్కిస్తుంటారు. స్వచ్ఛమైన నీటి పిహెచ్. విలువ ఏడు కాబట్టి ఈ పిహెచ్. స్కేల్ మీద తటస్థ బిందువు ఏడుగా గుర్తించారు. ఏడు కన్నా తక్కువగా ఉన్న వాటిని ఆమ్లాలని అంటారు. ఏడు కన్నా ఎక్కువగా ఉంటే వాటిని క్షారాలుగా పరిగణిస్తారు. వర్షపునీరు సాధారణంగా కాస్త ఆమ్ల పూరితమేనని చెప్పాలి. ఎందుకంటే ఆ నీటి పిహెచ్. విలువ దాదాపుగా ఆరు ఉంటుంది. అదే కాలుష్యం ఎక్కువగా ఉన్న ప్రాంతాలయితే వర్షపు నీరు ఎక్కువగా ఆమ్లపూరితంగా ఉంటుంది. అప్పుడు ఆ నీటి పిహెచ్. విలువ నాలుగు లేదా మూడు ఉండవచ్చు. వర్షపు నీటిలో సాధారణంగా ఉండే ఆమ్ల గుణం కన్నా ఎక్కువగా ఆమ్లపూరిత లక్షణాలుంటే ఆ వర్షాన్ని 'ఆమ్ల వర్షం' అంటారు.

బి. సంధ్య, తిరుపతి

**ప్రశ్న: విమానాల విషయంలో మనదేశం ప్రతిభ ఏమైనా ఉందా?**

**జవాబు:** ఉత్తరాలను విమానం ద్వారా చేరవేసే పద్ధతిని ప్రపంచంలోఏ మొదటిసారిగా మన దేశంలో ప్రవేశపెట్టారు. 1911లో హెన్రీ పిక్వెట్ హంబర్ విమానంలో 6,500ల ఉత్తరాలను అలహాబాద్ నుంచి నైనిటాల్ జంక్షన్‌కు చేరవేశాడు. టాటా కూడా తమ తొలి విమాన సర్వీస్‌లో తపాలాను కూడా తీసుకెళ్లారు. 1920లో ఇండియన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌బొంబాయి నుంచి కరాచీకి ఎయిర్ మెయిల్ సర్వీస్‌ను ప్రవేశపెట్టింది.

# ప్రజారోగ్య సంరక్షణలో డ్రోన్ల పాత్ర

**డ్రోన్లేంటీ! ఔషధాలు చేరవేయడమేంటీ? అని ఆశ్చర్యపోతున్నారా! నిజమే. ఇటీవల మేఘాలయ ప్రభుత్వం భారతదేశంలో ప్రజారోగ్యానికి కొత్త శకానికి నాంది పలికే విధంగా దేశంలోనే ప్రప్రథమంగా మేఘాలయ హెల్త్ సిస్టమ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్ట్ (ఎంహెచ్ఎస్ఎస్పి)ను ప్రారంభించి డ్రోన్‌ల ద్వారా మారుమూల ఆరోగ్య కేంద్రాలకు సైతం కేవలం ముప్పై నిమిషాల్లోనే ఔషధాలను చేరవేసే రాష్ట్రంగా అవతరించింది.**

మేఘాలయ ప్రభుత్వం ఈ వినూత్నమైన విధానాన్ని ప్రవేశపెట్టిన తరువాత సవాళ్లతో కూడిన కొండ ప్రాంతాలలో ఆరోగ్య సంరక్షణ పరిస్థితి బాగా మెరుగుపడింది. ఈ రాష్ట్రంలో, డ్రోన్లు మారుమూల ఆరోగ్య కేంద్రాలకు రవాణా సమయాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా ఔషధ రవాణాలో విప్లవాత్మక మార్పులకు తెరలేపాయి. కఠినమైన భౌగోళిక పరిస్థితులు, పేలవమైన రోడ్డు వ్యవస్థల కారణంగా రోడ్డు మార్గం ద్వారా లేదా కాలినడకన రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో ఉండే ఆరోగ్య కేంద్రాలకు కొన్ని గంటలు పట్టే ఔషధాల చేరవేత ఇప్పుడు డ్రోన్‌ల సహాయంతో కేవలం ముప్పై నిమిషాల్లోనే సాధ్యమవుతోంది.

భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ కోసం చివరి వినియోగదారులకు డ్రోన్ ఆధారిత ఔషధాలు, ఇతర వైద్య సామాగ్రి రవాణా ఇకపై సుదూర కల ఎంతమాత్రం కాదు. మేఘాలయ ఆరోగ్య మంత్రి అంపరీన్ లింగ్డో ఈ ప్రాజెక్టు ఒక ప్రతిష్టాత్మక విజయం అని గర్వంగా అభివర్ణిస్తూ ఈ రోజు తాము ఒక సాంకేతిక మైలురాయిని చేరుకోవడమే కాకుండా, ఆరోగ్యం విషయంలో తమ రాష్ట్రంలో ఎవరూ వెనుకబడి ఉండకుండా చూసుకుంటున్నామని, ఇది తాము కలలు కనే మేఘాలయ డ్రోన్ ఆధారిత గ్రామీణ ఆరోగ్య సంరక్షణ సదుపాయం అని అన్నారు.

## హబ్ అండ్ స్పోక్ విధానం

మేఘాలయ ప్రభుత్వం త్వరితగతిన ఆ రాష్ట్రంలోని మారుమూలల్లో ఉన్న ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలను చేరవేసేందుకు 'హబ్ అండ్ స్పోక్' వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఇక్కడ సెంట్రల్ హబ్ (జెంగ్జల్ సబ్ డివిజనల్ హాస్పిటల్ లాంటిది) వివిధ మారుమూల ఆరోగ్య కేంద్రాలకు (నోడ్స్) డ్రోన్‌లను పంపుతుంది. ఈ డ్రోన్లు అవసరమైన ఔషధాలు, టీకాలు, రక్త నమూనాలను చేరవేస్తాయి.

ఈ వినూత్న విధానం ప్రవేశపెట్టడంతో గతంలో వైద్య సేవల లభ్యత తక్కువగా



ఉన్న ప్రాంతాలలో వేగవంతమైన రోగ నిర్ధారణ, వైద్య చికిత్సకు మార్గం సుగమమైంది. మేఘాలయ హెల్త్ సిస్టమ్స్ స్ట్రెంథనింగ్ ప్రాజెక్ట్‌లో భాగంగా మేఘాలయ ప్రభుత్వం డిసెంబర్ 5, 2022న, భారతదేశంలోని మొట్టమొదటి డ్రోన్ స్టేషన్‌ను వెస్ట్ గారో హిల్స్‌లోని జెంగ్జల్ సబ్ డివిజనల్ హాస్పిటల్‌లో ప్రారంభించింది. ఇక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా చేరుకునేందుకు కష్టతరమైన ఆరోగ్య కేంద్రాలకు ఔషధాలను తరలిస్తారు. డ్రోన్‌ల ద్వారా 50కి.మీ వ్యాసార్థంలో ఉండే ఆరోగ్య కేంద్రాలకు వ్యాక్సిన్‌లు, ఔషధాలు, ఇతర సామాగ్రిని రవాణా చేస్తారు. తొలుత ఐదు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అనుసంధానంతో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, దశల వారీగా 2024 చివరి నాటికి 13 ఆరోగ్య కేంద్రాలకు విస్తరించారు. ఇది ఈస్ట్, వెస్ట్, సౌత్ గారో, వెస్ట్ ఖాసీ హిల్స్‌లను కవర్ చేస్తుంది.



రివర్స్ లాజిస్టిక్స్ విధానంలో పని చేసే ఈ వ్యవస్థలో భాగంగా ఔషధాలను, ఇతర సామాగ్రిని ఆరోగ్య కేంద్రాలకు తరలించే డ్రోన్‌లు తమ తిరుగు ప్రయాణంలో అక్కడి నుండి రోగుల రక్త, ఇతర నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రాలకు తరలిస్తాయి. పరీక్షల నివేదికలు వెలువడిన గంటలోపు వాటిని మరోమారు ఆరోగ్య కేంద్రాలకు తరలించడంతో, రోగ నిర్ధారణ వేగవంతంగా జరిగి త్వరితగతిన చికిత్స అందించడానికి వీలు కలుగుతుంది.



ఈ వినూత్న ప్రాజెక్ట్‌లో భాగంగా అన్ని ఆరోగ్య సౌకర్యాలను అనుసంధానించేందుకు మేఘాలయ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మరిన్ని డ్రోన్ స్టేషన్‌లను ఏర్పాటు చేసే యోచనలో ఉంది. ఈ డ్రోన్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రతి పౌరుడికి, వారి నివాస ప్రాంతంతో సంబంధం లేకుండా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. వినూత్నమైన చొరవతో, రాష్ట్రం ఆరోగ్య సంరక్షణలో రవాణా (లాజిస్టికల్) సవాళ్లను పరిష్కరించడమే కాకుండా నూతన ఆవిష్కరణకు, సాంకేతిక పురోగతి స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది.

## దుర్గమమైన కొండప్రాంతాలు

ఈశాన్య భారతం మధ్య ప్రాంతంలో ఉన్న మేఘాలయ అందమైన ప్రకృతి దృశ్యాలు, ప్రశాంతమైన కొండ పట్టణాలకు ప్రసిద్ధి చెందింది. అయితే ఈ అందమైన కొండ ప్రాంతాలలో ఇతరులు అంతగా గమనించని కఠినమైన సత్యం కూడా దాగి ఉంది. మేఘాలయలోని అనేక గ్రామీణ ప్రాంతాలు కొండలు, గుట్టలతో నిండిన నైసర్గిక స్వరూపంతో పాటు పేలవమైన రోడ్డు వ్యవస్థ, భారీ వర్షాల కారణంగా అక్కడ ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సదుపాయం అందని ద్రాక్షగా మిగిలిపోతోంది. అయితే, ప్రభుత్వం చొరవతో ఇప్పుడు అక్కడ పరిస్థితులలో మార్పు రావడమే కాకుండా గ్రామీణుల్లో తమ ఆరోగ్యం పట్ల ఆశావహ దృక్పథం ఏర్పడుతోంది. దుర్గమమైన కొండ ప్రాంతాలలో ఔషధాలను రవాణా చేసే డ్రోన్‌లు ఆకాశంలోకి రివ్వున దూసుకుపోతూ ఊహించిన దానికంటే వేగంగా అందుబాటులో లేని ప్రాంతాలకు సైతం అత్యవసర పరిస్థితులలో ప్రాణాలను రక్షించే ఔషధాలను, ఇతర వైద్య సామాగ్రిని చేరవేస్తున్నాయి. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 'డ్రోన్ హెల్త్‌కేర్ డెలివరీ ప్రోగ్రామ్'తో కలిసి మేఘాలయ ప్రభుత్వంచే నిర్వహించబడుతున్న సంచలనాత్మక 'మెడిసిన్ ఫ్రమ్ ది స్కై మేఘాలయ' చొరవ ద్వారా, అవసరమైన



మందులు, టీకాలు, రోగ నిర్ధారణ నమూనాలను డ్రోన్‌ల ద్వారా లోయలు, అడవుల గుండా నిమిషాల వ్యవధిలో రవాణా చేస్తారు. ఒకప్పుడు 4 నుండి 6 గంటలు ప్రయాణించాల్సిన ఆరోగ్య కార్యకర్తలకు ఇప్పుడు కేవలం ముప్పై నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయం పడుతోంది. ఇది సాంకేతిక నవీకరణ మాత్రమే కాదు, డ్రోన్‌లను ఉపయోగించి ప్రాణాలను రక్షించే ప్రజారోగ్య ఆవిష్కర్త!

## ప్రత్యేకంగా రూపొందించిన డ్రోన్లు

మేఘాలయ పర్వత భౌగోళిక స్వరూపానికి అనువుగా ఉండేలా ప్రత్యేకంగా రూపొందించిన ఈ డ్రోన్‌లు అధిక సామర్థ్యంతో, ఒకే ఛార్జ్‌పై నలభై కిలోమీటర్లకు పైగా 2 కిలోగ్రాముల వరకు పేలోడ్‌లతో ప్రయాణించగలవు. అంతేకాదు, కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత స్వయంప్రతిపత్తి నావిగేషన్, రియల్ టైమ్ జిపిఎస్ ట్రాకింగ్, సురక్షితమైన ల్యాండింగ్ సాంకేతికతో అమర్చబడ్డాయి.



మేఘాలయ ప్రభుత్వం ఈ విజయం భారతదేశంలో మారుమూల ప్రాంతాలకు ఔషధాలు, ఇతర వైద్య సామాగ్రి సరఫరా కోసం భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న డ్రోన్ మౌలిక సదుపాయాలను ప్రతిబింబిస్తుంది. ఇది కేవలం రవాణా వ్యవస్థ (లాజిస్టిక్స్) గురించి మాత్రమే కాదు, మానవ స్ఫూర్తి, సహకార శక్తి వేడుక. మేఘాలయ ప్రభుత్వం చేపట్టిన ఈ చొరవ ఇప్పటికే పొరుగు రాష్ట్రాలైన అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మిజోరాం రాష్ట్రాలలో డ్రోన్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ సేవలు ప్రవేశపెట్టేందుకు ప్రేరణనిస్తోంది. ఇది ఔషధాల రవాణా కోసం స్వదేశీ మానవరహిత గగన వాహన (యుఎవి) పరిష్కారాలను ఉపయోగించడం ద్వారా భారతదేశం విస్తృత డిజిటల్ హెల్త్ మిషన్, ఆత్మనిర్భర్ భారత్ డ్రోన్ సాంకేతికత లక్ష్యసాధనకు సమన్వయం అవుతోంది.

మేఘాలయ ప్రభుత్వం డ్రోన్లను ఉపయోగించి ఔషధాలను, ఇతర వైద్య సామాగ్రిని మారుమూల కొండ ప్రాంతాలకు రవాణా చేస్తూ, ఆరోగ్య సంరక్షణ సదుపాయాల లేమితో అవస్థలు పడుతున్న ప్రజానీకం సంక్షేమం పట్ల చేపడుతున్న చొరవను దేశంలోని ఇతర రాష్ట్రాలు కూడా ప్రేరణగా తీసుకుని ఆధునిక వైద్య సేవల వంచనకు గురవుతున్న ఏజన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు వైద్య సదుపాయాలు కల్పించి 'స్వస్థ భారత్' దిశగా కృషి చేయాలి.

**- యేచన్ చంద్ర శేఖర్**

కథ

# నమ్మకం

తాళ్ళూరి లక్ష్మి

**"వచ్చే వారం మూడు రోజులు పనికి రానమ్మగారూ!" పిడుగులాంటి విషయాన్ని రాగాలు తీస్తూ మరీ తెలిపింది పనమ్మాయి సీతాలు.**

**ఆ మాటలకు వంట గదిలో టిఫిన్ తయారు చేస్తున్న లలిత ఒక్కసారి ఉలిక్కిపడింది."ఆదేమిటే, పోయిన వారమే కదా నీ అక్క కూతురు పెద్దమనిషి అయ్యిందని రెండు రోజులు నాగాలు పెట్టావు. మళ్లీ ఏమొచ్చింది?"**


"పోయినేడు జబ్బు చేసినప్పుడు మా చిన్నోడి తలనీలాలు సమర్పిస్తానని వెంకన్నకు మొక్కుకున్నానమ్మగారూ. నా పెనిమిటికి ఇప్పటికి కుదిరింది. రైలు టికెట్లు, దర్శనం టికెట్లు అన్నీ ఏర్పాటు చేశాడు. మా కుటుంబం నలుగురం వచ్చే బుధవారం తిరుమల వెళ్ళి వెంకన్న దర్శనం చేసుకుని శనివారం కల్లా వచ్చేస్తాం" వివరంగా చెప్పింది సీతాలు.

ఏడుకొండలవాడి దర్శనానికి, అందులో మొక్కు చెల్లించుకోవడానికి అనేసరికి మరేం మాట్లాడలేకపోయింది లలిత.

"సరేలే! నా తిప్పలేవో నేను పడతాను. మొక్కు చెల్లించుకుని రా. తర్వాత మాత్రం మళ్ళీ అదనీ ఇదనీ నాగాలు పెట్టకూడదు" ముందు జాగ్రత్తగా తన కండిషన్లు ఏకరువు పెట్టింది లలిత, వాటి విలువ పనమ్మాయికి గరికపోచతో సమానమని తెలిసినా.

ఆ రాత్రి పడుకునేటప్పుడు భర్త రవీంద్రతో "వచ్చే వారం మన పనమ్మాయి సీతాలు తన కొడుకు మొక్కు తీర్చుకోడానికి తిరుపతి వెళ్తోంది. అది మొక్కనగానే నాకు నా మొక్కు గుర్తుకొచ్చింది. ఆర్నెల్ల క్రితం మన పెద్ద మనవడు అనిల్‌కి అమెరికాలో ఆక్సిడెంట్ అయ్యిందంటే వాడు క్షేమంగా కోలుకుంటే శ్రీవారిని దర్శనం చేసుకుని హుండీలో పది వేలు వేస్తానని మొక్కుకున్నాను.

మనిద్దరం ఇప్పట్లో వెళ్ళడం ఎలాగూ కుదరదు. కనీసం డబ్బయినా సీతాలుతో పంపించి హుండీలో వేస్తే ఎలాగుంటుందా? అని ఆలోచిస్తున్నాను" అంది లలిత.



"భేషయిన ఆలోచన. దీనికి తటపటాయింపు ఎందుకు. సీతాలుతో డబ్బు పంపించి, హుండీలో వేయించు. త్వరలో వీలు చూసుకుని మనిద్దరం స్వామి దర్శనం చేసుకుందాం" మెచ్చుకోలుగా అన్నాడు రవీంద్ర.

"అదికాదండీ. ఒకవేళ డబ్బుకు ఆశపడి వాళ్ళు హుండీలో వేయకపోతే!? ఒకటి కాదు. రెండు కాదు. ఏకంగా పది వేలు" తన మనసులోని సందేహాన్ని బయటపెట్టింది లలిత.

"ఛ. అలాంటి అనుమానాలు ఏవీ పెట్టుకోకు లలితా. మొక్కు తీర్చుకోడానికి సమర్పించే ముడుపు కోసం ఏ మనిషీ కక్కుర్తి పడదు. అందులోనూ వడ్డీకాసులవాడి సొమ్ము".

"నాకు తెలుసండీ. కానీ పది వేలు అనేసరికి కొంచం జంకుగా ఉంది"

"మనుషుల మీద నమ్మకం ఉంచాలి లలితా. ఏ నూటికో కోటికో ఒకరిద్దరు తప్పితే మనుషులలో అధిక శాతం నీతి నిజాయితీ మీద నమ్మకం ఉన్నవాళ్లే, దానిని ఆచరిస్తున్నవాళ్ళే. మనుషులు సహజంగా మంచివాళ్లే కానీ మోసగాళ్ళు కాదు. మనసులో ఎటువంటి శంకలు పెట్టుకోకుండా సీతాలు ద్వారా ఆ పది వేల మొక్కు చెల్లించుకో" సుస్పష్టంగా చెప్పాడు రవీంద్ర.

.........

"ఈ రోజు సాయంత్రమే మా ప్రయాణం అమ్మగారూ. మధ్యాహ్నం మరోసారి వచ్చి అంట్లగిన్నెలు తోమేస్తాను" పొద్దుటే పనికి వచ్చిన సీతాలు లలితతో అంది.

"ఆదివారం పొద్దుట తప్పకుండా వస్తావు కదా?" తన సందేహం నివృత్తి చేసుకోడానికి మరోసారి సీతాలుని అడిగింది లలిత.

"ఎంత ఆలస్యమైనా తప్పకుండా వచ్చేస్తానమ్మగారు. అంట్లగిన్నెలు అలాగే ఉంచేయండి" లలితకి మరోసారి భరోసా ఇచ్చింది సీతాలు.

పనైపోయాక ఇక వెళ్తానని తన దగ్గరకు వచ్చిన సీతాలుతో "ఒక్క క్షణం ఉండవే" అంటూ లలిత బెడ్రూంలోకి వెళ్ళి తను కట్టిన ముడుపు తీసుకుని తిరిగి వచ్చింది.

"ఇదిగో...! స్వామి దర్శనం చేసుకున్నాక గర్భగుడి పక్కనే ఉన్న హుండీలో ఈ ముడుపు నా పేరు మీద వెయ్యవే. మా మనవడి కోసమని మొక్కుకున్నాను. ముడుపు జాగ్రత్త. చాలా డబ్బుంది. పదిలంగా నీ దగ్గరే ఉంచుకో. ఎవరికీ ఇవ్వకు. గుడిలో స్వామి వారి హుండీలోనే వెయ్యి" ఎన్నో జాగ్రత్తలు చెబుతూ ముడుపు మూటను సీతాలుకు అందజేసింది లలిత.

"అలాగేనమ్మగారు. తప్పకుండా నేనే హుండీలో వేస్తా" అంటూ ముడుపు తీసుకుని లలిత దగ్గర వీడ్కోలు తీసుకుంది సీతాలు.

..........

ఉదయం ఆరు గంటలకి తిరుపతి చేరుకుంది సీతాలు కుటుంబం. కొండపైకి చేరుకునేసరికి దాదాపు ఎనిమిదయింది. శ్రీవారి ఆలయం ఎదురుగా వాణిజ్య సముదాయం దగ్గర భక్తుల సౌకర్యార్థం కట్టిన షెడ్లు చేరుకుని అక్కడే ఉన్న ఉచిత శౌచాలయంలో కాలకృత్యాలు అవీ తీర్చుకుని టిఫిన్ గట్రా కానిచ్చి పిల్లాడి తలనీలాలు సమర్పించుకోడానికి కళ్యాణ కట్ట చేరుకున్నారు కుటుంబమంతా.

ఏడుకొండల వాడికి తలనీలాలు సమర్పించి స్నానాలు కానిచ్చేసరికి మధ్యాహ్నం పన్నెండయ్యింది. శ్రీవారి నిత్యాన్నదాన కేంద్రంలో భోజనాలు కానిచ్చి మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం గేటు చేరుకునేసరికి సరిగ్గా ఒంటిగంటయింది. హమ్మయ్య, దేవస్థానం వారు సూచించిన సమయానికల్లా చేరుకోగలిగామని భార్యాభర్తలిద్దరు ఊపిరి పీల్చుకున్నారు.

క్యూలో మూడు గంటల పాటు గడిపాక నాలుగు గంటల ప్రాంతంలో దేవాలయం లోపలి వెండి వాకిలి చేరుకున్నారు. అప్పటి వరకు ఒక క్రమ పద్ధతిలో ముందుకు సాగుతున్న క్యూ వెండి వాకిలి తరువాత ఒక్కసారిగా అందరినీ గుంపుగా వదలడంతో అక్కడంతా గందరగోళంగా తయారై తోపులాటలు మొదలయ్యాయి.

ఆ తోపులాటలో పిల్లలు ఎక్కడ నలిగిపోతారేమోనని సీతాలు, ఆమె భర్త పిల్లల్ని తమ భుజాల మీద కూర్చోబెట్టుకుని ముందుకు సాగారు. అలా ఒకరి నొకరు తోసుకుంటూనే గర్భాలయం ప్రవేశించి స్వామిని రెండు క్షణాలపాటు దర్శించుకుని బయట పడ్డారు. ఆ రెండు క్షణాల దర్శనానికే వారి తనువులు పులకరించి పోయాయి.

దైవ దర్శనం చేసుకున్న ఆనందం మొహాల్లో స్పష్టంగా వెల్లివిరుస్తుండగా సీతాలు కుటుంబం గుడి ఆవరణలో ఇస్తున్న ప్రసాదం తిని గుడి బయటకు వచ్చారు.

"మీరిక్కడే ఉండండి. నేను వెళ్ళి లడ్డూలు కొని తీసుకొస్తాను" అని సీతాలు భర్త రాములు వెళ్లబోయాడు.

అంతలో సీతాలు గట్టిగా అరిచింది "అయ్యో మావా! అసలు విషయం మరిచిపోయాను".

రాములు కంగారు పడుతూ "ఏం మరచి పోయావే?" అనడిగాడు.

"అదే మావా, అమ్మగారిచ్చిన ముడుపు హుండీలో వెయ్యడం మరచి పొయ్యాను. ఇప్పుడెలా?" దాదాపు ఏడిచినంత పని చేసింది సీతాలు.

"ఓస్! దానికేనా ఇంత కంగారు. ఆ మెట్ల పైన ఇంకో హుండీ ఉందిలే. అక్కడేయవచ్చు. లేదా వరాహ స్వామి గుడిలో వెయ్యవచ్చు".

"కాదు మావా. అమ్మగారు మరీ మరీ చెప్పారు.. లోపల గర్భగుడి పక్కనే ఉన్న హుండీలోనే వెయ్యమని. పోనీ ఒకసారి ఆ పోలీసాయనను అడగరాదూ. నన్ను హుండీ దాకా పంపిస్తాడేమోనని".

సీతాలు బాధ చూడలేక దేవాలయం ప్రధాన ముఖద్వారం దగ్గర ఉన్న ఒక వాలంటీర్‌తో జరిగిన విషయం చెప్పి సీతాలును లోపలికి పంపడానికి అనుమతి కోరాడు రాములు.

అతను ఎట్టి పరిస్థితులలోనూ అది కుదరదని చెప్పి "కావాలంటే గుడిలో పనిచేసే వారికెవరికైనా ముడుపు ఇచ్చి హుండీలో వెయ్యమని చెప్పవచ్చు" అన్నాడు.

అదే విషయం సీతాలుతో చెబితే "అమ్మో! ఇంకొకరికి ఇవ్వడమే. లలితమ్మగారు నామీద ఎంతో నమ్మకముంచి హుండీలో వెయ్యమని ఇచ్చారు. అది ఇంకొకరికి ఇవ్వడమే!" అంటూ ఆ పని

"ఆదివారం పొద్దుట తప్పకుండా వస్తావు కదా?" తన సందేహం నివృత్తి చేసుకోడానికి మరోసారి సీతాలుని అడిగింది లలిత.
"ఎంత ఆలస్యమైనా తప్పకుండా వచ్చేస్తానమ్మగారు. అంట్లగిన్నెలు అలాగే ఉంచేయండి" లలితకి మరోసారి భరోసా ఇచ్చింది సీతాలు.

చేయడానికి ససేమిరా ఒప్పుకోనంది.

"మరేం చేద్దామే?" ఏం చేయాలో తోచక అయోమయంగా చూశాడు రాములు. "ఒక పని చేద్దాం మావా. నువ్వు పిల్లల్ని తీసుకుని పైన షెడ్డు దగ్గరకు వెళ్లిపో. నేను స్వామి దర్శనం మరోసారి చేసుకుని, హుండీలో ముడుపు వేసి రాత్రికి నిన్ను కలుస్తాను" అంది.

"ఇప్పుడా! ధర్మ దర్శనం చేసుకోవాలంటే కనీసం ఎనిమిది గంటల సమయమైనా పడుతుంది. దర్శనం చేసుకునేసరికి ఏ అర్ధరాత్రో అవుతుంది. పొద్దుటి నుండి నీకసలు విశ్రాంతే లేదు.

ఇప్పటికే బాగా అలసిపోయున్నావు. కష్టమవుతుంది. బాగా ఆలోచించుకో" అన్నాడు రాములు.

"కష్టమేమీ లేదు మావా. నేను వెళ్లగలను. అక్కడే క్యూ కంపార్టుమెంట్లలో విశ్రాంతి తీసుకుంటానులే. మీరెళ్లండి" దృఢ నిశ్చయంతో అంది సీతాలు.

భర్తనీ, పిల్లల్నీ పంపించేసి తను వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం దాకా నడుచుకుంటూ వెళ్ళి సర్వదర్శనం క్యూలో కలిసింది సీతాలు.

దేవస్థానం వారు సరఫరా చేసిన పాలు తాగి, ఏడుకొండలవాడి నామస్మరణ చేసుకుంటూ దాదాపు ఏడు గంటలు క్యూలో సమయం గడిపాక రాత్రి పన్నెండు గంటలకు దేవాలయ ప్రాంగణంలోకి అడుగు పెట్టగలిగింది సీతాలు. ఈసారి మధ్యాన్నం మాదిరి రద్దీ ఏమీ లేదు. జనం పల్చగా ఉండటం వల్ల గర్భగుడిలో కూడా ఎవరు తొందర పెట్టకుండా నిదానంగా స్వామిని దర్శనం చేసుకొనిచ్చారు. కళ్లార్పకుండా స్వామి వారి దివ్య విగ్రహాన్ని తనివితీరా చూసుకుంది సీతాలు.



అనుకోని ఆ అదృష్టానికి సీతాలు మనసు ఉప్పొంగిపోయింది. ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో అనుకుని మురిసిపోయింది.

ఈ పర్యాయం మరచిపోకుండా లలితమ్మగారు ఇచ్చిన పది వేల రూపాయల ముడుపు, దాంతో కలిపి తన దగ్గరున్న వంద రూపాయలు నోటు హుండీలో వేసి భక్తిగా వెంకన్నకు నమస్కరించుకొంది.

.........

"ఏమే సీతాలూ! దర్శనం ఎలా జరిగింది" ఆదివారం ప్రొద్దుటే పనికి వచ్చిన సీతాలుని అడిగింది లలిత.

"మీ దయ వల్ల చాలా బాగా దర్శనం జరిగింది అమ్మగారు. ఒకసారి కాదు.. రెండు సార్లు దర్శనం అయింది అమ్మగారూ" ఎంతో సంబరంగా అంది సీతాలు.

"నేనేం చేశానే?" సీతాలు మాటలు అర్థమవక కొంచం తికమక పడుతూ అడిగింది లలిత.

తిరుమలలో జరిగిన విషయాలన్నీ పూస గుచ్చినట్లు వివరంగా లలితకి చెప్పింది సీతాలు. చివరగా "అమ్మగారూ! మొదటిసారి దర్శనానికి వెళ్ళినప్పుడు మూడు వందల రూపాయల శీఘ్ర దర్శనమైనా అంతా గడబిడగా, తొక్కిసలాడుకుంటూ దర్శనమయింది. రాత్రి రెండోసారి మీకోసమని వెళ్లినప్పుడు కొంచం ఆలస్యమైనా ఎంతో సాఫీగా, హాయిగా, సంతృప్తిగా స్వామివారి దర్శనం అయింది" ఎంతో ఆనందపడిపోతూ అంది సీతాలు.

సీతాలు చెప్పిన మాటలు విని అవాక్కయింది లలిత. తనకి ఇచ్చిన మాట పూర్తి చెయ్యడం కోసం సీతాలు ఎంత శ్రమ పడింది. అదే తను సీతాలు స్థానంలో ఉంటే అంత కష్ట పడేదా?

లలిత చెవుల్లో భర్త చెప్పిన మాటలు గింగురుమన్నాయి "మనుషులు సహజంగా మంచివాళ్లు లలితా. మనం మనుషుల మీద నమ్మకం ఉంచాలి".

తన కళ్ల ముందరే సీతాలు "ఇంతింతై వటుడింతై" అన్నట్టు మేరు పర్వతం లాగా పెరిగిపోయిన భావన కలిగింది లలితకు. ■

## ప్రశ్న

తండ్రి శ్మశానం నుంచి తిరిగి వచ్చాడు.

ఏడేళ్ల పిల్లవాడు కిటికీ దగ్గరే కూర్చుని రోడ్డుని చూస్తున్నాడు. వాడి ఒంటిమీద బట్టలు లేవు. మెడలో బంగారు గొలుసు ఉంది. దేని గురించి ఆలోచిస్తున్నాడు, అతని మనసుకీ తెలియదు.

వేపచెట్టు చిటారుకోమ్మల్లో సూరీడు చిక్కుకున్నాడు.

మామిడిపండ్లు అమ్మే వ్యక్తి ఆ వీధిలోకి వచ్చి మామిడి పండ్లు... మామిడిపండ్లు ఒకటి, రెండు సార్లు అరచి వెళ్లిపోయాడు.

తండ్రి లోపలి నుండి వచ్చి పిల్లాడిని ఎత్తుకున్నాడు. పిల్లాడు తండ్రిని అడిగేడు.. "అమ్మ ఏది?"

ఆకాశం వైపు చూస్తూ తండ్రి "స్వర్గంలో..!" అని సమాధానమిచ్చాడు.

ఆ రాత్రంతా తండ్రి కుమిలిపోతూనే ఉన్నాడు.

గోడకి గుడ్డి వెలుగు లాంతరు వేలాడుతోంది.

ఆ పిల్లాడు వచ్చి అరుగు మీద నిలబడ్డాడు.

చుట్టుతా దీపాల్లేని ఇళ్లన్నీ నిద్రలోనే వాళ్లకు కాపలా కాస్తున్నట్టున్నాయి.

పిల్లవాడు అలా ఆకాశం వంక చూస్తున్నాడు. కలవరపాటుతో వాడి మనసు అపుడప్పుడూ ప్రశ్నిస్తోంది.. "స్వర్గానికి దారి ఎక్కడ?"

ఆకాశం కదలలేదు, సమాధానం చెప్పడానికి. ఆ భారమైన చీకటి మోనానికి నక్షత్రాలు కన్నీళ్లు పెట్టుకున్నాయి.

– టి.లలితా ప్రసాద్


## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

# తల్లిపలుకు దారి ఎటు?

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగానికి గొడ్డలిపెట్టుగా పరిణమించిన గత ప్రభుత్వం చేసిన జీ.ఓ.117కు ప్రస్తుత ప్రభుత్వం స్వస్తి పలకటం, విద్యాశాఖలో నూతన సంస్కరణలు చేపట్టడం అభినందనీయం. అప్పటి ప్రభుత్వ ఉత్తర్వుతో ప్రాథమిక విద్యా వ్యవస్థకు, ప్రధానంగా మాతృభాష తెలుగుకు ఊపిరి సలపని దుస్థితి ప్రాప్తిస్తోందని ఉపాధ్యాయులు, మేధావులు, భాషాభిమానుల నాటి ఆందోళన, అరణ్య రోదనమైంది. 2025-26 విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాలలో సమూల మార్పులు వస్తున్నాయి. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు ప్రభుత్వం చేపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 9 తరగతుల విద్యార్థులు గణితం, ఆంగ్లం, తెలుగు పాఠ్యాంశాలలో వెనుకబడి ఉంటే, సాంకేతికత సహాయంతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించి తరగతి గదిలో అభ్యసన ఫలితాలు మెరుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర శిక్షణా విధానానికి శ్రీకారం చుట్టింది.

ప్రభుత్వ పాఠశాలలలో కంప్యూటర్ ప్రయోగశాలలు రానున్నాయి. విద్యను అత్యంత ప్రాధాన్యతా రంగాలలో ముఖ్యమైనదిగా ప్రస్తుత ప్రభుత్వం గుర్తించటం హర్షణీయం.




విద్యా, వైద్యం, వ్యాపారం, ఉద్యోగ, ఉపాధి రంగాలు ముఖ్యంగా ఐటీ రంగంలో ఇంగ్లీష్ నేర్చుకోవడం వల్లనే యువత ప్రస్తుత డిజిటల్ యుగంలో రాణించడానికి అవకాశాలు పుష్కలంగా పొందవచ్చు. కానీ మాతృభాషలు ప్రస్తుత సాంకేతిక యుగంలో, ఏ స్థానంలో వున్నాయో కూడా ప్రభుత్వాలు పరిశీలించవలసిన అవసరం వుంది. మాతృభాష, మాధ్యమంగా వుండే ప్రాథమిక స్థాయి విద్యను ప్రోత్సహించాలనే అభిప్రాయం, ప్రాంతీయ భాషలు అనాదరణకు గురి కాకుండా చేయవలసిన కర్తవ్యాన్ని ప్రభుత్వం గుర్తు పెట్టుకోవాలి. విద్యావంతులైన మధ్య, పేద తల్లిదండ్రులు తమ పిల్లల్ని కూడా ప్రతిభావంతంగా తీర్చిదిద్దగల ప్రైవేట్ విద్యకే ప్రాధాన్యం యివ్వటం కారణంగా యిప్పటికే తెలుగు రాష్ట్రాలలోని యువత సంపన్న దేశాలకు అసంఖ్యాకంగా తరలి వెళ్తున్నారు. ఉత్తర భారతం కూడా దక్షిణాది రాష్ట్రాలతో పోటీ పడుతోంది. మాతృభాషలో విద్యాబోధన అటక ఎక్కకుండా చిత్తశుద్ధితో రాష్ట్ర ప్రభుత్వాధినేతలు చర్యలు చేపట్టాలి..తప్పదు.

రాజ్యభాషగా హిందీ భారతదేశ ఐక్యతకు కీలక పాత్ర పోషించగలదనే ఆలోచన నేటిది కాదు. మాతృభాష ప్రాధాన్యతను, ఆవశ్యకతను నొక్కి చెప్తూనే, మహాత్మాగాంధీ వంటి జాతినేతలు హిందీ నేర్చుకోవలసినదిగా 'దక్షిణ భారత హిందీ' ప్రచారాన్ని ప్రోత్సహించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ఉత్తర-దక్షిణ భారతావని ఐక్యత దృష్ట్యా హిందీ రాజ్యభాష అయింది. ప్రస్తుతం ఇంగ్లీష్‌కి అగ్ర ప్రాధాన్యం యివ్వబట్టే డిజిటల్ రంగంలో దేశం దూసుకుపోతోంది.

జాతీయ భాషా విభాగానికి స్వర్ణ జయంతి వేడుకలు వచ్చాయి. భారతదేశం మొత్తంమీద అధిక సంఖ్యాకుల భాషగా హిందీ రాజ్యభాషగా నిలదొక్కుకుంది. అతిపెద్ద ప్రజాస్వామ్యమైన మన దేశంలో హిందీ ఇతర భారతీయ భాషలతో సమన్వయం చేసుకొంటూ 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని సాధించాలని ప్రధాని నరేంద్రమోడీ భవిష్యత్ కార్యాచరణకు పునాదులు వేస్తున్నారు. సామాన్య ప్రజానీకాన్ని తమ తమ మాతృభాషల ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలకు అనుసంధించాలంటే మాతృభాషలను నిర్లక్ష్యం చేయడం తగదు. నరేంద్రమోడీ ప్రభుత్వం 11 భారతీయ భాషలకు ప్రాచీన హోదా కల్పించింది. 2020లో కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం, ప్రాంతీయ భాషలకు పెద్ద పీట వేసింది. భాషతోనే సంస్కృతి ముడిపడి వుంది. కేవలం ఇంగ్లీష్, హిందీలకు జాతీయ, అంతర్జాతీయ ప్రాధాన్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వాలు శృతి మించిన ప్రాధాన్యత ఇస్తే, భిన్నత్వం దేశంలో క్షీణిస్తుంది. భవిష్యతరాలకు తల్లి భాషలోని సాహిత్యం, చరిత్ర, సాంస్కృతిక విలువలకు మరింత దూరం కావలసి వస్తుంది. ఇప్పటికే వివిధ మాతృభాషలలోని వారసత్వ చారిత్రక అస్తిత్వ ఔన్నత్యాలు మరుగున పడిపోతున్నాయి. గ్రంథాలయాలు మూల పడుతున్నాయి. పుస్తకాలు, ప్రాచీన విలువలు పాత చింతకాయ, నిర్లిప్త, నిర్లక్ష్య ధోరణులు కమ్ముకొంటున్నాయి. అమెరికా వంటి అగ్ర రాజ్యాలలో, సంపన్నవంతమైన అధునాతన సాంకేతికత ప్రజ్వరిల్లుతున్న విదేశాలలో ప్రవాసులు తాము ఏదో కోల్పోతున్నామనే భావనలతోనే మాతృభాషను గురించి ఆలోచిస్తున్నారు. మన రాజకీయవేత్తలు కేంద్రం మెప్పుదల కోసం హిందీ, రాష్ట్ర ప్రజల ఒప్పుదల కోసం ఆంగ్లం అంటున్నారు. మరి తెలుగుకు దారి ఎటు?

**- జయసూర్య**

# ఆరోగ్యానికి నిమ్మ

విరివిగా లభించే నిమ్మ, ఉసిరికాయల్లో ఆరోగ్యంతో పాటు సౌందర్య పరిరక్షణ ప్రయోజనాలున్నాయి.

నిమ్మకాయను ప్రాచీన ఈజిప్షియన్లు విష ప్రభావం నుంచి తమను తాము కాపాడుకోవడానికి తినేవారు. నిమ్మరసం తాగేవారు. నిమ్మకాయలో ఉండే యాంటీవైరల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాల వల్ల రోగ నిరోధక వ్యవస్థ బలపడుతుంది. ఆహారంలో వీటి వాడకం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయి. నిమ్మలో విటమిన్ బి, సి వంటి పోషకాహార గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఎముకల దృఢత్వానికి చాలా అవసరం. నిమ్మలో ఫాస్ఫరస్, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్స్ లభిస్తాయి. యాంటీక్యాన్సర్, యాంటీయాక్సిడెంట్ లక్షణాలుగల ఫ్లేవనాయిడ్లు నిమ్మలో సమృద్ధిగా ఉంటాయి. వీటిలో శాచిరేటెడ్ కొవ్వు ఉండదు. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కళ్లకు, చర్మానికి మేలు చేసే విటమిన్-ఎ బాగా లభిస్తుంది. పొటాషియం, రాగి, ఐరన్ వంటి ఖనిజాలు నిమ్మలో ఎక్కువగా లభిస్తాయి. గుండె కొట్టుకోవడం, రక్తప్రసరణ నియంత్రణకు పొటాషియం అవసరం. ఆ పొటాషియం నిమ్మలో ఉన్నందున వాటిని ఆహారంలో ఉపయోగిస్తే మేలు కలుగుతుంది.

ఇక ఆరోగ్యం విషయానికొస్తే నిమ్మకాయలు రక్తనాళాలను బలోపేతం చేస్తాయి. అత్యధిక రక్తపోటును నియంత్రించడం వల్ల అంతర్గత హెమరేజ్‌ను ఇవి అరికడతాయి. గౌట్ రుమాటిజం చికిత్సల్లో నిమ్మను వాడతారు. నిమ్మరసం డెయురేటిక్‌గా పనిచేసి మూత్రపిండాలు, మూత్రాశయం ఇబ్బందుల నుంచి కాపాడుతుంది. ఇవి జీర్ణశక్తికి సహకరించి గుండెమంట, కడుపుబ్బరాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేడినీటిలో కొన్ని చుక్కలు నిమ్మరసం వేసుకొని తాగుతుంటే కాలేయం స్వచ్ఛంగా ఉండి అజీర్ణాన్ని తగ్గిస్తుంది. నిమ్మకాయలు జీవక్రియను మెరుగుపరుస్తాయి కాబట్టి డయేరియా, మలబద్ధకాన్ని నియంత్రించవచ్చు. నిమ్మచెక్కలు ఎండబెట్టి పొడిచేసి తలకు పట్టిస్తే తలనొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. నాలుకపై పొక్కులు మంటలు చికిత్సలో నిమ్మరసం తోడ్పడుతుంది. క్రిమికీటకాలు కుడితే ఆ గాట్లపై నిమ్మరసం రాయడంవల్ల విషం విడుదలై నొప్పి తగ్గుతుంది.



సౌందర్యాన్ని కాపాడుకోవడానికి నిమ్మకాయలు ఎంతో ఉపయోగపడతాయి. మొటిమలపై నిమ్మరసం రాస్తే అవి బుగ్గలపై ఎక్కువగా విస్తరించవు. స్కిన్ బ్లీచ్‌గా నిమ్మరసం బాగా పనిచేస్తుంది. నిమ్మరసం మాడుకు పట్టిస్తే చుండ్రు తగ్గుతుంది. చర్మం దురద పెడుతున్నపుడు నిమ్మరసం చికిత్సగా పనిచేస్తుంది. శిరోజాలకు నిమ్మరసం పట్టిస్తే జిడ్డు తగ్గుతుంది. నిమ్మకాయలు వినియోగించేటపుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. నిమ్మరసంతో పాటు ఎక్కువ నీరు తాగాలి. ఎందుకంటే నిమ్మకాయల్లో డీహైడ్రేటింగ్ గుణాలుంటాయి. చర్మంపై నిమ్మరసం రాసినపుడు సూర్యకిరణాలు ఎక్కువగా సోకకూడదు. నిమ్మరసం చర్మం ఫోటోసెన్సిటివిటీని పెంచుతుంది. దాంతో సన్‌బర్న్స్‌కు ఎక్కువ అవకాశాలుంటాయి. నిమ్మకాయల్లో ఎసిడిక్ గుణాలు ఎక్కువ కాబట్టి తరచు నిమ్మరసం తాగేవారు స్ట్రా వాడాలి. దీనిపై పళ్లపై ఉండే ఎనామిల్‌కు ఇబ్బంది కలగదు.

## ఉసిరి

శీతాకాలం రాగానే మనకు విరివిగా ఉసిరికాయలు కనిపిస్తాయి. విటమిన్ సికి ఉసిరికాయే ఆధారం. రోజుకు ఒక్క ఉసిరి తిన్నా ఆరోగ్యరీత్యా ఎన్నో అద్భుతాలు కలుగుతాయి. ఆమ్లా ఇండియన్ గూస్‌బెర్రీ అని కూడా వీటిని పిలుస్తారు. ఉసిరికాయలు పుల్లగా ఉంటాయి. ఈ చిన్న ఆకుపచ్చ సిట్రస్‌బ్లాస్ట్‌లో అనేక గుణాలు దాగున్నాయని మన పెద్దలు ఎప్పుడో గుర్తించారు. తలకు రాసే హెయిర్ ఆయిల్‌తో కలిపి ఉసిరి వాడితే జుట్టు ఆరోగ్యంగా దృఢంగా పెరుగుతుంది. బ్రోంకైటీస్ ఆస్తమాల నుంచి కాపాడడానికి ఉసిరి బాగా పనిచేస్తుంది. రక్తంలో చక్కెరను క్రమబద్ధీకరించి కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. కళ్లు, పళ్లు రక్షించడంలో ఉసిరి పనిచేయడమేగాక పూర్తిస్థాయి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మందుల పెట్టెలా ఉపయోగపడుతుంది. అత్యంత సహజమైన సి విటమిన్ ఉసిరిలో పుష్కలంగా లభిస్తుంది. చిన్న ఉసిరికాయ రెండు నారింజపండ్లు లభించే విటమిన్ సికి సమానంగా ఉంటుంది. సి విటమిన్‌ను సప్లిమెంట్‌ల రూపంలో తీసుకుంటే ప్రతీసారి శరీరం సులువుగా గ్రహించదు. అయితే ఉసిరి తిన్నపుడు మన శరీరం దానిలోని సి విటమిన్‌ను సులువుగా గ్రహిస్తుంది. ఇది మెదడుకు కూడా అత్యంత శక్తిమంతమైన ఆహారం. అద్భుతమయిన యాంటీయాక్సిడెంట్ ముసలితనంతో సునాయాసంగా పోరాడుతుంది. కణాల డీజెనరేషన్‌కు కారణమయ్యే అస్థిర ఐకాన్లతోను పోరాడుతుంది. ఉసిరికాయ గుండెను సైతం బాగా పనిచేసేలా చేస్తుంది. ఇతర ఆహార పదార్థాల్లోని మంచిని సంగ్రహించి శరీరానికి సహకరించడం ఉసిరిలోని మరో మంచిగుణం. ఆహారం శరీరానికి పట్టడానికి ఉసిరి సహకరిస్తుంది కాబట్టి తినే ఆహారం నుంచి పోషకాలు అందుతాయి. ఐరన్ వంటి ఖనిజాలు గ్రహించి ఆహారాన్ని శరీరం సులువుగా జీర్ణం చేసుకోవడానికి ఉసిరి సాయపడుతుంది. ఉసిరికాయ ప్రొటీన్ మెటబాలిజాన్ని మెరుగు పరుస్తుంది కాబట్టి రోజు వ్యాయామం చేసేవారు క్రమం తప్పకుండా ఉసిరిని తీసుకోవాలి.

**- యామిజాల జగదీశ్**

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
సెల్స్: 9885446501/9885449458

# 'శంకపాలక వేధ' అంటే?

'శంకపాలం జంఘహీనం',
శంకపాలేకు రూపం స్వాత్॥

ఏ గృహమైతే స్తంభాలు లేకుండా ఉంటుందో ఆ గృహం 'శంకపాలం' అనే వేధా దోషాన్ని కలిగి ఉంటుంది. బరువు భారం వహించే కుడ్యాలు ఉన్న గృహం స్తంభాలు లేకున్నా, గోడలే స్తంభాలుగా వ్యవహరిస్తాయి. కనుక ఇలాంటి దోషం కలగదు. శాస్త్ర వచనానుసారం 'శంకపాల వేధా దోషం గల గృహం యజమానికి, అందులో నివసించే వారికి అనారోగ్య సమస్యలను ముఖ్యంగా అందవిహీనులుగా చేసే దుష్ఫలితం కలిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుత సమాజంలో దాదాపు ప్రతి గృహం కూడా స్తంభాలు (పిల్లర్స్)తోనే నిర్మిస్తున్నారు. కనుక గృహాలను బట్టి 'శంకపాలక వేధా దోషం కలిగే అవకాశాలు తక్కువ.

పాత కాలంలో నిర్మించిన 'భవంతీ' గృహాలలోగానీ, పెంకుటిండ్లలోగానీ పై దూలాలను లేదా పై కప్పును గానీ దృఢమైన కలప స్తంభాలు కూడా గృహంలోని స్తంభాల శ్రేణిలోకే వస్తాయి.

## వికట వేధ

దిగ్వక్రత్వం వికటం స్మృతం ।
వికటఃపృథుకే రమ్యే
విశాల కరాళయో! ॥

(నానార్థ రత్నమాల)

'వికటం' అంటే విస్తారమైనదనీ, మిక్కిలి భయంకరమైనదనీ అర్థం. సింహద్వారం వికటంగా వున్నట్లయితే 'వికటం' అనే వేధా దోషమేర్పడుతుంది. ఒక గృహానికుండే సింహద్వారం ఆ గృహానికుండే అన్ని ద్వారాల కంటే పెద్దగా, రమణీయంగా ఉండాలని వాస్తు నియమం. అంతేగానీ ఒక సింహద్వారం సహజంగా ఉండవలసిన పొడవు, వెడల్పుల కంటే మించి అసహజంగా, అతిగా ఉన్నా, భయంకరంగా కనిపించేలా ఉన్నా 'వికట వేధా దోషం' కలుగజేస్తుంది. గృహమంతా వాస్తు ప్రకారం నిర్మించినా, సింహద్వారం విషయంలో పొరపాట్లు జరిగితే చింతించక తప్పదు. 'వికటవేధా దోషం' వల్ల తీరని నష్టాలు కలిగే అవకాశాలున్నాయి. దోషం తెలుసుకొని సవరించుకోవడం వల్ల శీఘ్రంగా సత్ఫలితాలను పొందవచ్చు.



## ప్రత్యామ్నాయ మార్గాలు?

ఎస్.కార్తికేయ, గద్వాల

**ప్రశ్న: మా ప్రధాన ద్వారంలోకి భూగర్భంలో బోరు, నీళ్లసంపు, పంపుమోటర్లు ఉన్నాయి. వాటిని మార్చడానికిగానీ, మెయిన్ గేటును మార్చడానికిగానీ వీలు లేదు. ఇలా ఉండటం ఇంటికి క్షేమదాయకమేనా? లేక ఏమైనా ప్రత్యామ్నాయ మార్గాలున్నాయా?**

**జవాబు:** ప్రధాన ద్వారానికి ఎదురుగా ఉండకూడనివి ఎన్నో ఉన్నాయి. అందులో మీరు పేర్కొన్నవి కొన్ని. ఇవన్నీ ప్రధాన ద్వారానికి ఎదురుగా రాకూడదు. బయట నుండి ఇంట్లోకి గానీ, ఇంట్లో నుండి బయటకుగానీ వచ్చేటపుడు వీటిపై నడుచుకుంటూ వెళ్లకూడదు. తప్పకుండా సరైన స్థానంలోకి వీటిని మార్చాలి. అండర్ గ్రౌండ్‌లోనే బోరుని పైపుతో మరొక దిశకి మార్చడం మినహా చేయగలిగింది ఏమీ లేదు. వీటన్నింటినీ మార్చే అవకాశాలు లేకపోతే ద్వారాన్ని వాస్తు పరంగా అనువైన చోటుకి మార్చే వీలుందేమో చూడండి. ఇటువంటి సందర్భాలలో వాస్తు నిపుణులకు గృహాన్ని ప్రత్యక్షంగా చూపించి వీలైనన్ని సవరణలు చేయించుకుంటే మంచిది. ప్రత్యామ్నాయ పద్ధతులు ఉన్నాయి. కానీ అన్ని సందర్భాలలో ఇవి కుదరవు. మీ విషయంలో తప్పకుండా మార్పులు చేసుకోవాలి. అవసరమైన మార్పులు చేసి సత్ఫలితాలు పొందండి.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు.
ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే,
రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ..............................................
పుట్టిన తేది : ..............................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................
చిరునామా:..................................................

# శివకేశవ ప్రియం 'శ్రావణం'



భారతదేశంలో కొన్ని చోట్ల సూర్యమానం మరికొన్ని చోట్ల చాంద్రమానం అనుసరించడం జరుగుతోంది. ఆ ప్రకారం నెలలు, వారాలు, పర్వదినాలను నిర్ణయిస్తారు.

మన హిందూ పంచాంగం ప్రకారం సంవత్సరానికి పన్నెండు నెలలు ఉన్నాయి. చైత్ర మాసంతో ఆరంభమయ్యే ఈ నెలలు ఫాల్గుణ మాసంతో ముగుస్తాయి.

వాతావరణ పరిస్థితులను ఆధారంగా చేసుకొని కొన్ని మాసాలను శుభప్రదమైనవిగా మరికొన్నింటిని శూన్య మాసాలుగా నిర్ణయించడం జరిగింది. శుభప్రదమైన నెలలో ఒకటి శ్రావణ మాసం. పంచాంగం ప్రకారం అయిదవదైన శ్రావణం ఆంగ్ల నెలలు జులై-ఆగస్టు మధ్యలో వస్తుంది. పౌర్ణమి రోజున ఉండే నక్షత్రం పేరుతో ఆ మాసాన్ని పిలుస్తారు. శ్రావణంలో పౌర్ణమి నాడు శ్రవణా నక్షత్రం ఉండటం వలన శ్రావణ మాసం అయ్యింది.

కార్తికం మాదిరిగా శ్రావణం కూడా హరిహర ప్రియ మాసం. శ్రావణ మాస ప్రస్థాపన స్కంద పురాణంలో ఉన్నట్లుగా తెలుస్తోంది. శ్రావణ మాసం శివకేశవ ప్రియమైనది మాత్రమే కాదు ముల్లోకాలను లాలించి, పాలించే అమ్మవారికి కూడా అత్యంత ప్రీతికరమైన నెల.

శ్రావణ మాసంలో వర్షాలు అధికంగా కురుస్తాయి. అన్నదాతలకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఈ కారణంగా శ్రావణ మాసాన్ని 'శుభ మాసం' అని అంటారు. కొందరు 'నభో మాసం' అని కూడా పిలుస్తారు. నభో అంటే ఆకాశం అని అర్థం. అంటే ఆకాశమంత గొప్పది అని చెప్పుకోవచ్చు. అందువల్ల ఈ నెలలో ఎన్నో పర్వదినాలు. సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు, అమావాస్య, పౌర్ణమి, చతుర్థి, పంచమి, అష్టమి, ఏకాదశి, ద్వాదశి ఇలా అన్నీ పవిత్రమైనవే!

మహిళలు ఎన్నో రకాల పూజలు, వ్రతాలు, నోములు కుటుంబ క్షేమం కోసం ఆచరిస్తారు.

### చంద్ర ప్రభావం

చంద్రుడు మన మనస్సు, ఆలోచనల మీద అధిక ప్రభావం చూపిస్తాడు అని చెబుతున్నది జ్యోతిష్య శాస్త్రం. శ్రావణం చంద్ర మాసం. చంద్రుడు అత్యంత చంచలుడు అవడం వలన చంచల మనస్సు చెడు ఆలోచనలు రావడం, అవి దుష్ఫలితాలకు దారి తీయడం జరుగుతుంది. అలాంటి వాటిని దూరం చేయడానికి, ధర్మాచరణ కోసం, మానసిక శాంతి పొందడానికి, ప్రకృతి అనిశ్చిత ప్రభావం వలన కలిగే అనారోగ్యాల బారి నుండి కాపాడుకోడానికి ఈ మాసంలో అనేక పండుగలు వస్తాయి. ఈ పర్వదినాలలో చేయవలసిన ఆచారాల పాలన వలన మానసిక, శారీరక, జీవిత సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

### శ్రావణ మాస పురాణ గాథ

దేవదానవులు ఇద్దరూ కలిసి క్షీరసాగర మథనం చేసిన విషయం మనందరికీ తెలిసినదే! అమృతం ఉద్భవించడానికి ముందు కల్పవృక్షం, కామధేనువు, ఐరావతం, శ్రీ మహాలక్ష్మి, శ్రీ ధన్వంతరి అవతరించారు. అదే క్రమంలో లోకాలను నాశనం చేయగల హాలాహలం అంటే విషం కూడా వెలికి వచ్చింది. లయకారకుడైన పరమేశ్వరుడు లోకక్షేమం కోసం హాలాహలాన్ని స్వీకరించారు. విషం గొంతులో నిలపడం వలన స్వామి నీలకంఠుడు అయ్యారు. ఆయనను చల్ల బరచడానికి దేవతలు శిరస్సున గంగ, చంద్రుని ఉంచారు అని పురాణ గాథ తెలియచేస్తోంది. అందుకనే కార్తికంలో మాదిరి శ్రావణంలో కూడా శివాలయాలలో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు.

### కన్వర్ యాత్ర

ఉత్తర భారతదేశంలో ఎక్కువగా చేసే ఈ యాత్ర ప్రత్యేకమైనది. శ్రావణ మాసంలో భక్తులు దీక్ష తీసుకొని సమీప నదిలోని నీటిని రెండు పాత్రలలో నింపుకొంటారు. పాత్రలను కావడిలో అమర్చి "బోల్ బం ... బోల్ బం" అంటూ కాలినడకన తాము నిర్ణయించుకొన్న శైవ క్షేత్రానికి యాత్ర చేస్తారు. కావడిలో ఉంచిన నీటితో గంగాధరునికి అభిషేకం చేయడంతో దీక్ష యాత్ర రెండూ పూర్తి అవుతాయి. ఈ యాత్ర ఆదివారం ఆరంభించి సోమవారం సాయంత్రానికి ముగించేలా ప్రయాణం అవుతారు. దక్షిణ భారతదేశంలో శివాలయాలలో రుద్రాభిషేకాలను నిర్వహిస్తుంటారు.



## మంగళ గౌరీ వ్రతం

శ్రావణ మాసంలో మహిళలు సౌభాగ్యం, కుటుంబ, వంశాభివృద్ధి కోసం తప్పనిసరిగా చేయవలసిన వ్రతం 'మంగళగౌరీ వ్రతం'.

ఈ విషయాన్ని స్వయంగా శ్రీకృష్ణ పరమాత్మ ద్రౌపదీ దేవికి తెలిపారట. నారద మహర్షి సావిత్రీ దేవి చేత ఈ వ్రతం చేయించడం వలన ఆమె యమధర్మరాజు నుండి తన భర్త సత్యవంతుని ప్రాణాలను తిరిగి పొందగలిగినది. నెలలో వచ్చే నాలుగు/ఐదు మంగళ వారాలు స్త్రీలు భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. ముత్తైదువులకు వాయినాలు ఇచ్చి వారి ఆశీర్వాదం పొందుతారు.

## శ్రావణ శుక్రవార పూజలు

స్థితికారకులైన లక్ష్మీనారాయణుల ప్రీత్యర్థం శ్రావణ మాసంలో పూజలు చేస్తారు. వాటిలో విశిష్టమైనది శుక్రవారం పూజలు. ఈ నెలలో ప్రతి శుక్రవారం పుణ్యస్త్రీలు విధిగా శ్రీలక్ష్మీ దేవి పూజలు చేస్తారు. శ్రావణ పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు శ్రీ వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తారు.

శ్రీసూక్తంలో ఈ వ్రత విధానం గురించి వివరించారు. సకల సంపదలకు కారణభూతురాలైన దేవదేవికి షోడశోపచార పూజలు చేస్తారు. విద్య, ధనం, ధాన్యం, సంతోషం, శాంతి, సత్సంతానం ప్రసాదించే తల్లిని యథాశక్తి ప్రార్థిస్తారు. అమ్మవారి స్వరూపాలుగా ముత్తైదువులకు పండ్లు, తాంబూలం ఇస్తారు. శుభకరం మంగళకరమైన శ్రీ వరలక్ష్మీ పూజ వలన సకల శుభాలు పొందగలరన్నది శాస్త్రవాక్యం.

## శనివారం ఇష్టదైవారాధన

ప్రతి ఇంటికీ ఒక కులదైవం ఉంటారు. నియమం తప్పకుండా కుల లేదా ఇంటి ఇలవేల్పును పూజించడం శుభకరం. ముఖ్యంగా శ్రావణ మాసంలో ఇలవేల్పుతో పాటు శ్రీమన్నారాయణుని అవతారాలైన శ్రీ వెంకటేశ్వర, శ్రీ సత్యన్నారాయణ వ్రతాలను చేసుకోవడం విధాయకం అని పెద్దలు చెప్పిన మాట.

శ్రవణం శ్రీవారి జన్మ నక్షత్రం. శనివారం స్వామివారికి ప్రీతిపాత్రమైన రోజు. అందువలన వ్రతాన్ని శనివారం చేసుకోవడం వలన మనోభీష్టాలు నెరవేరతాయి.

## శ్రావణ పౌర్ణిమ

శ్రావణ మాసంలో వచ్చే పర్వదినాలలో పౌర్ణమికి ఒక ప్రత్యేకత ఉన్నది. శ్రావణ పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమి,



రాఖీ పౌర్ణమి అని కూడా పిలుస్తారు.

జంధ్యాన్ని యజ్ఞోపవీతం అని పిలుస్తారు. వేదకాలం నుండి శ్రీ గాయత్రీ స్వరూపం, బ్రహ్మ సూత్రానికి ప్రతీక అయిన యజ్ఞోపవీతాన్ని ధరించడం ఆచారవంతులకు ఆనవాయితీ. పౌర్ణమి రోజున నూతన యజ్ఞోపవీతాన్ని శాస్త్రోక్తంగా ధరిస్తారు. ఆడబిడ్డలు తోడబుట్టిన సోదరుల, తమ పట్ల ఆప్యాయత చూపించే వారి అభివృద్ధి క్షేమం కోరుకొంటూ రక్షా బంధన్ పౌర్ణమినాడు కడతారు. రాఖీ పౌర్ణమిగా పిలవబడే ఈ రోజున రాఖీ కట్టడానికి ఒక విధానం ఉన్నది అని శాంతి కమలాకారం అనే శాస్త్రగ్రంథం తెలుపుతోంది. రాఖీ లేదా రక్షను ఉదయం పూజామందిరంలో ఉంచి పూజించి మధ్యాహ్నం సమయంలో తమ శ్రేయోభిలాషులకు, ఆప్తులకు, సోదరుల ముంజేతికి కడితే పూర్తి ఫలితం ఉంటుంది.

కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా కర్ణాటక, తమిళనాడులలో శ్రావణ పౌర్ణమినాడు శ్రీ సత్యన్నారాయణ వ్రతం బంధు-మిత్రులతో కలిసి శుభప్రదంగా చేసుకొనే ఆచారం నెలకొని ఉన్నట్లుగా తెలుస్తోంది.

## శ్రీ హయగ్రీవ

శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రకారం విద్య, జ్ఞాన ప్రదాత శ్రీ హయగ్రీవుడు. శ్రీమన్నారాయణుని మరో అవతారం శ్రీ హయగ్రీవుడు. భాగవత పురాణం, మహాభారతం ఇత్యాది గ్రంథాలలో వేదరక్షకునిగా శ్రీ హయగ్రీవ నామం ప్రస్తావించారు.

శ్రావణ పౌర్ణమి, శ్రీ హయగ్రీవ స్వామి లోకసంరక్షణార్థం అవతరించిన రోజుగా చెప్పబడుతోంది. శ్రీవైష్ణవ ఆలయాలలో శ్రీ హయగ్రీవ జయంతి సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు.

ఇవే కాకుండా శ్రావణ మాసంలో నాగచతుర్థి, నాగ పంచమి, పుత్రదా ఏకాదశి, దామోదర ద్వాదశి, శ్రీ వరాహ జయంతి, పొలాల అమావాస్య, శ్రీకృష్ణ జనాష్టమి కూడా హిందువులు వారి వారి సంప్రదాయాల ప్రకారం ఘనంగా చేసుకొంటారు. ఆయుష్షు, ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మిక పరివర్తన ప్రసాదించే శ్రావణ మాసం సర్వ శుభకరం.

– ఇలపావులూరి వెంకటేశ్వర్లు


## సరదా రచనలకు ఆహ్వానం

**జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా: నవ్వుల్..రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.**

sunmagvaartha@gmail.com

# తల్లిపాలల్లో పోషకాలెక్కువ..

**తల్లిపాల** వల్ల కలిగే ప్రయోజ నాలపై అవగాహన కల్పించాలని మనం ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటివారం 1-7వ తేదీ వరకు 120



దేశాల్లో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు జరుపుకుంటున్నాం. జాతీయ తల్లిపాల నెల ఆగస్టు అని చెప్పవచ్చు.

అవగాహనా రాహిత్యం వల్ల చాలా మంది తల్లులు తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించలేక పోతున్నారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం, డాక్టర్ల సలహాలు, నర్సింగ్ కేర్ అవసరం. గర్భధారణ, ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలు రాకుండా ముందే ఆరోగ్య సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల, బ్రెస్ట్ ఫీడింగ్ పైన ఉన్న అపోహల్ని దూరం చేయడమే తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.

**'తల్లిపాల నినాదం':** పిల్లలు బలంగా ఎదగడానికి తల్లిపాలు ప్రకృతి ప్రసాదించిన బహుమతి అని చెప్పవచ్చు. సగానికి పైగా తల్లులు పిల్లలకి సరిగా పాలివ్వలేక పోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 37 శాతం శిశువులే ఆరు నెలల వరకు పాలు తాగుతున్నారని అంచనా. డబ్ల్యుహెచ్ఓ అంచనాల ప్రకారం, ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలి. అమెరికాలోని పిడియాట్రిక్స్ అకాడమీ, అమెరికన్ కాలేజ్ ఆఫ్ అబ్‌స్టెట్రిషియన్స్ అండ్ గైనకాలజిస్ట్స్ సంవత్సరం వరకు వీలైతే రెండు సంవత్సరాల వరకు పాలు ఇవ్వడం వల్ల ఆనందకరమైన అనుభూతి తల్లి-బిడ్డల మధ్య పెరిగి సెక్యూరిటీ ఫీలింగ్ కలుగుతుందని తేల్చారు.

తల్లిపాలను సరిగా ఇవ్వగలిగితే ప్రతి సంవత్సరం 8-10 లక్షల మంది పిల్లల్ని 5 సంవత్సరాల లోపు, స్త్రీలలో రొమ్ము కేన్సర్‌తో బాధపడే 20 వేల మందిని మరణించకుండా కాపాడవచ్చు.

తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన తేలికగా జీర్ణమయ్యే పోషకాలుండి వారి శారీరక, మానసిక అవసరాలకు తగినట్లుగా మారుతూ ఉంటుంది. బిడ్డకు అవసరమైన తొలి పోషణ, రక్షణ ఇవ్వాల్సిన తల్లి బాధ్యతని గుర్తు చేయడమే అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.

ఇది సహజంగా జరిగే ప్రక్రియ. కానీ కొందరిలో కొన్ని సమస్యలు ఎదురవుతాయి. తల్లి బిడ్డకు పాలిచ్చే ప్రక్రియలో 1-7 రోజులు పట్టవచ్చు. దీనికి కంగారు పడనక్కర్లేదు. తల్లిలోని ఆక్సిటోసిన్ హార్మోన్స్ వల్ల క్షీర గ్రంథుల్లోని డక్ట్స్ తెరుచుకోవడం వల్ల ప్రొలాక్టిన్ హార్మోన్‌వల్ల ప్రతి ఒక్కరిలో పాలు పడతాయి. అందుకే ప్రసవానికి మూడు నెలల ముందే పుట్టబోయే శిశువుకు ఏ విధంగా, ఎన్ని సార్లు, ఎలా పాలు పట్టాలి? ఎన్ని సార్లు మల, మూత్ర విసర్జన చేస్తారు? పిల్లలు ఎక్కువసేపు నిద్రపోవడం, ఎలా తాగాలో శిశువుకు తెలియక పోవడం, ఎంతసేపు వీలైతే అంతసేపు స్టిములేషన్ ఇవ్వడం వంటి సమస్యల్ని ఎలా ఎదుర్కోవాలి? అని కౌన్సెలింగ్ సెషన్ తీసుకోవడం అన్ని విధాలా మంచిది. బ్రెస్ట్ ఫీడింగ్ టెక్నిక్స్‌ని ఒర్పు, నేర్పుతో తెలుసు కోవడం చాలా అవసరం. దీని వల్ల తల్లి, బిడ్డ అనుబంధం బాగుంటుంది. నార్మల్ డెలివరి అయిన అరగంటలోపు, సిజేరియన్ అయిన 4



గంటల లోపు వీలైనంత త్వరగా బిడ్డకు తల్లిపాలని ఇవ్వడం ప్రారంభించాలి. చాలా మందిలో పుట్టిన వెంటనే కొన్ని చుక్కల నుండి 10 మి.లీ. పసుపు పచ్చని ముర్రుపాలు పడతాయి. వీటిలో శిశువుకు కావలసిన ఇమ్యూనిటీని పెంపొందించే ఆంటీబాడీస్ ఉంటాయి. కాన్పు అయిన 2 నుంచి 4 రోజులకి 300- 400 మి.లీ., 5వ రోజు నుంచి 500-800 మి.లీ. పాలు ఉత్పత్తి అయి వేగంగా పెరిగే బిడ్డ శరీర అవసరాలకు తగినట్లుగా ఉండి శక్తిని అందిస్తాయి. వీటిలో లాక్టోజ్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. 5-14వ రోజు వరకు వచ్చే పాలని 'ట్రాన్సిషనల్ మిల్క్' అంటారు.

కాన్పు అయిన 4 వారాల తర్వాత వచ్చే పాలలో 90శాతం నీరు, పిండి పదార్థాలు, విటమిన్స్, మినరల్స్, 2శాతం ప్రోటీన్స్, 8శాతం క్రొవ్వులు, షుగర్స్, ఎంజైమ్స్, హార్మోన్స్, గ్రోత్ ఫ్యాక్టర్స్ ఉండి బిడ్డల సంపూర్ణ ఎదుగుదలకు సాయం చేస్తాయి.

చాలా మంది తల్లులు తమ పిల్లలకు సరిపోయేనన్ని పాలు ఇవ్వలేకపోతున్నామని మథన పడిపోతుంటారు. కారణం.. అనారోగ్య సమస్యలు, వత్తిడి, బాడీ హైడ్రేషన్, ప్రసవం తర్వాత అలసట, నీరసంతో ఎక్కువగా నిద్రపోవడం, సరైన ఆహారం తీసుకోకపోవటం, పత్యం ఉండటం కారణం. తల్లిపాలు పడడానికి మాత్రలు, మందులు వాడటం కంటే ఆరోగ్యకరమైన సమతుల ఆహారం తీసుకోవటం వల్ల తల్లిపాలు సమృద్ధిగా పడతాయి.

ఒక రోటీన్‌లో పడేంతవరకు ప్రయత్నలోపం లేకుండా నర్సింగ్ డిమాండ్‌ని బట్టి రోజుకి 8-10 సార్లు తల్లిపాలు ఇవ్వచ్చు. ప్రతిరోజూ 120 నిమిషాలు/ 2 గంటలు పంపింగ్ చేయాలని డాక్టర్లు సూచిస్తున్నారు. తల్లిపాలు ఇచ్చే రేటులో 97 దేశాల్లో శ్రీలంక మొదటి స్థానంలో ఉంది. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము, అండాశయ కేన్సర్స్-ఆస్టియోపోరోసిస్ (ఎముకలు బోలువారడం) మధుమేహం, గుండె, రక్తనాళాల వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. శిశువు ప్రతి 2-3 గంటలకు 45-90 మి.లీ. పాలు తాగుతారని అంచనా.

ఒక శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వటాన్ని 'ఇబిఎఫ్ ఫీడింగ్' అంటారు. తల్లిపాల ప్రాముఖ్యత ఇప్పటిది కాదు, దీన్ని 3000 బి.సిలోనే కనుగొన్నారు. నేషనల్ బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్ డిసెంబరు 3, 1991 మహారాష్ట్రలోని 'వార్ధా'లో స్థాపించబడింది. తల్లిపాలు ఇవ్వడం,





ప్రోత్సహించడం, మద్దతు ద్వారా తల్లి-బిడ్డ ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి అంకితమైన సంస్థలు. ప్రతి సంవత్సరం 2.5 మిలియన్ల నవజాత శిశువులు పుట్టిన 2-3 నెలల్లోనే చనిపోతున్నారు. ఆరోగ్యకరమైన ప్రారంభానికి ఆశాజనక భవిష్యత్తుగా తల్లిపాల వారోత్సవాల ప్రాముఖ్యాన్ని గుర్తించారు. మొదటి 1992లో తల్లి శ్రేయస్సు ఆమె బిడ్డ భవిష్యత్‌ను సరైన విధంగా రూపొందించడానికి వరల్డ్ అలయన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ యాక్షన్ (డబ్ల్యుఎబిఎ) తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల్ని హైలెట్ చేయడంతో ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రపంచ తల్లిపాల వారోత్సవం 2025 'థీమ్ ప్రకారం' తల్లి పాలు అందరికి ఒక బాధ్యత అని భావిస్తున్నారు. డబ్ల్యుహెచ్ఒ, యుఎన్ఐసిఇఎ వంటి అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు తల్లి పాల ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి ఈ థీమ్‌ని సమర్థిస్తున్నాయి. తల్లిపాలు శిశువులకు అవసరమైన పోషకాల్ని అందించడమే కాకుండా, వారి పెరుగుదలకు, అభివృద్ధికి కీలకమని ఈ థీమ్ నొక్కి చెబుతోంది. తల్లిపాల వారోత్సవాలపై రూపొందించిన ప్రత్యేక లోగోలో పైన ఉన్న ఎర్రటి చేయి రక్షణను అందిస్తుంది. కింద ఉన్న నీలంచేయి ప్రజారోగ్య విధానాన్ని ఉపయోగించి తల్లిపాల్ని ప్రోత్సహిచడానికి అవసరమైన మద్దతును అందిస్తుంది. పైన ఉన్న ఎర్రటి అర్థ వృత్తం ప్రపంచ సమాజాన్ని అందిస్తుంది. ఎందుకంటే తల్లిపాలను రక్షించడం అనేది ఉమ్మడి బాధ్యత. మనమందరం పోషించాల్సిన పాత్ర ఉందనేది తల్లిపాలు ఇవ్వడానికి సంబంధించిన ఇతివృత్తాలపై అవగాహన పెంచడానికి, చర్యల్ని ప్రోత్సహించడానికి ఒక ప్రపంచవ్యాప్త ప్రచారం. ఇలా చాలా అంశాలపై అవగాహన కల్పించడానికే తల్లిపాల వారోత్సవాల్ని వారం రోజులు (మొదటివారం చాలా ముఖ్యం) ఆరోగ్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు కలిసికట్టుగా ప్రపంచ వ్యాప్తంగా చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. మనం కూడా మన వంతు సాయంగా అందరిలో అవగాహన కల్పిద్దాం. ప్రతి ఒక్కరిని ఒక సామాజిక బాధ్యతగా భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుదాం.

**- డా.కె.ఉమాదేవి**

## జూలై 27, 2025 నుండి ఆగస్టు 2, 2025 వరకు

# వారఫలం




శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం చాలా సందర్భాలలో మీ అంచనాలు తారుమారు అవుతాయి. పెట్టుబడులు కీలకమైన చర్చలు ముఖ్యమైన ప్రయాణాలలో నిదానంగా వ్యవహరించండి. నిత్యం మహాతీర్థం పొడిచేసే అభిషేకాలు, పూజలు మంచి ఫలితాలను ఇస్తాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా మీ స్థాయి యథాతథంగా ఉంటుంది. ఆర్థిక పరమైన వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి.

### వృషభం

ఈ వారం ఏ పని ఎందుకు చేస్తున్నారో మీకు తప్ప ఇతరులకు తెలియనివ్వరు. రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడుతాయి. అర్థికాభివృద్ధి కొరకు లక్ష్మీకటాక్షం అనే పూజా ద్రవ్యాన్ని ఉపయోగించండి. కొత్త రంగాలలో అనుభవం సాధించడానికి గాను శ్రీకారం చుడతారు. విలాసవంతమైన వస్తువులను కొనుగోలు చేప్తారు. ప్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

### మిథునం

ఈ వారం వివాహాది శుభకార్య చర్చలను సాగిస్తారు. పలువురు ప్రశంసించే విధంగా నడవడిక ఉంటుంది. కుటుంబ బరువు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించగలుగుతారు. పెట్టుబడికి కావల్సిన ధనాన్ని ధైర్యం చేసి అప్పు చేస్తారు. రహస్యంగా చర్చలను సాగిస్తారు. నిత్యం సుబ్రహ్మణ్య పాశుపత కంకణం ధరించండి. విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుంటారు.

### కర్కాటకం

ఈ వారం కర్త, కర్మ, క్రియ అన్నీ మీరే అయ్యి సంస్థను ముందుకు నడిపిస్తారు. ప్రతినిత్యం లక్ష్మీదేవికి ఆరావళి కుంకుమ, జవ్వాదితో కలిపి పూజ చేయటం వలన మేలు జరుగుతుంది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. గతంలో దూరమైన వర్గం తిరిగి ఈ వారం చేరువవుతారు. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

### సింహం

ఈ వారం సేవకా సిబ్బంది వలన సహోద్యోగుల వలన చెప్పుకోదగిన స్థాయిలో కాకపోయినా ఇబ్బందులేర్పడతాయి. అధ్యాత్మిక కార్యక్రమాలకు దీక్షలు నిర్వహిస్తారు. నానారకాల అరిష్టాలు, శత్రు బాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. కోర్టు తీర్పులు అనుకూలంగా పరిణమిస్తాయి. పాత బాకీలు తీరుస్తారు.

### కన్య

ఈ వారం మాతృ వర్గీయ బంధువులకు మీ వంతు సహాయసహకారాలను అందిస్తాలు. విద్యార్థినీ విద్యార్థులు నిత్యం సరస్వతీ తిలకాన్ని నుదుటన ధరించడం, జ్ఞానచూర్ణాన్ని సేవించడం, మేధా దక్షిణామూర్తి రూపును మెడలో ధరించడం వలన మంచిఫలితాలను పొందగలుగుతారు. ఎంతగానో శ్రమించి అంతంత మాత్రపు ఫలితాలనే సాధిస్తారు.

### తుల

ఈ వారం ఆస్తుల పరిరక్షణ కష్టసాధ్యముగా పరిణమిస్తుంది. దైవం మీద భారం వేసి ముఖ్యమైన వ్యవహారాలను చక్కబరుచుకోగలుగుతారు. రెండు పడవల మీద ప్రయణం శ్రేయస్కరం కాదని తెలిసినప్పటికీ ప్రయోజనాల పరిరక్షణకు ఇటువంటి సాహసాలను చేస్తారు. నిత్యం సర్పదోష నివారణ చూర్ణముతో సర్వరక్షా చూర్ణము కలిపి స్నానం చేయడం వలన గ్రహాల వలన కలుగు బాధలు తొలగిపోతాయి.

### వృశ్చికం

ఈ వారం అనకూలంగానే ఉంటుంది. శుభకార్యాలు సానుకూల పడతాయి. విదేశాల మండి విలువైన సమాచారాన్ని అందుకుంటారు. గృహం లేక వాహనం కొనుగోలు చేస్తారు. ఐశ్వర్య ప్రాప్తికి, వృత్తి, ఉద్యోగాలలో కలుసుబాటుకు లక్ష్మి చందనం ధరించటం వలన మేలు జరుగుతుంది. వృత్తి, ఉద్యోగాల పరంగా వ్యక్తిగత గౌరవం మరింతగా పెంపొందుతుంది.

### ధనస్సు

ఈ వారం చిన్న చిన్న ఆటంకాలు పనులలో ఏర్పడినప్పటికీ చెప్పుకోదగిన స్థాయిలో ఇబ్బందులేవి ఉండవు. వ్యాపార విస్తరణ కార్యక్రమాలకు గాను మీరు చేసే కృషి ఫలిస్తుంది. ప్రతినిత్యం నాగసింధూరం నుదుటన ధరించటం వలన జనాకర్షణ ఏర్పడు తుంది. ఋణం ఇవ్వడం, ఋణం తీసుకోవడం రెండు కలిసి రావు, క్రయవిక్రయాలలో స్వల్పలాభాలు పొందుతారు.

### మకరం

ఈ వారం మిశ్రమ ఫలితాలు గోచరిస్తున్నాయి. ప్రతి బంధకాలను అధిగమించి పనులను సానుకూల పరుచుకుంటారు. ఆర్థికాభివృద్ధి కొరకు లక్ష్మికటాక్షం అనే పుణద్రవ్యాన్ని ఉపయోగించండి. బ్యాంకు ఋణాల విషయంలో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. విభేదాలు తారాస్థాయికి చేరుకోకుండా ఆదిలోనే పరిష్కరించుకోండి. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.


### కుంభం


ఈ వారం వ్యాపారపరంగా స్వల్పమైన అభివృద్ధిని సాధించగలుగుతారు. నానారకాల అరిష్టాలు, శత్రు బాధలు, బాధలు నశించడానికి త్రిశూల్ ఉపయోగించండి. ఉచిత సలహాలు ఇచ్చేవారు అధికంగా ఉంటారు. కొత్త కార్యక్రమాలు ప్రారంభించి సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో ఆదరణ పొందుతారు. ఇంటా బయటా ప్రోత్సాహకరంగా వుంటుంది. వస్తు, వస్త్రాలభాలు.


### మీనం

ఈ వారం చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. ప్రతి నిత్యం ఇంట్లో గానీ, వ్యాపార ప్రదేశాలలో కానీ అష్టమూలికా గుగ్గిలంతో ధూపం వేయండి. కొత్త వ్యక్తులు పరిచయమై కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ప్రముఖులనుండి శుభ ఆహ్వానాలు అందుతాయి. కాంట్రాక్టులు, సబ్ కాంట్రాక్టులు, లైసెన్సులు, లీజులు లాభిస్తాయి.

# ఈ వారం 'కార్టూన్స్'


ఫైల్ కవర్ ఎక్కుద్దాం సార్!
ఇదే ఫైల్ కవర్


యువత మొబైల్ కు బానిసలై, గంటలకొద్దీ సమయం వృథా చేసుకుంటున్నారు... ఛ్ఛ..!!


అర్జెంట్ గా అప్పు ఎవరిస్తారని గూగుల్ ని అడిగితే- మీ ఇల్లు చూపించింది సర్.. ప్లీజ్!!

# ఫోటో ఫీచర్



చైనాలోని వెన్యూ గ్రామంలో ఇళ్ల నిర్మాణం విభిన్నంగా ఉంటుంది. పై నుంచి చూస్తే ఈ ఊరు గడియారం ఆకారంలో కనిపిస్తుంది. ఊరి మధ్యలో చెరువు, దాని చుట్టూ పంటపొలాలు, వాటి చుట్టూ వృత్తాకారంలో ఇళ్లు.. అదీ ఈ ఊరి ప్రత్యేకత.

